విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 సంచిక : 322 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ మంగళవారం 14 ఏప్రిల్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణ

- హైకోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన కేజ్రీవాల్!
- న్యాయమూర్తిని మార్చాలని విజ్ఞప్తి.. స్త్ర దర్యాప్తు సంస్థల తీరుపై సంచలన ఆరోపణలు

2





# బడులు తెరిచేనాటికి సంక్షేమ హాస్టళ్లలో వసతులు

### మున్సిపాలిటీల్లో ఫిర్యాదు అందగానే సమస్య పరిష్కరించాలి

### వివిధ శాఖలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి అన్ని వసతిగృహాల్ని పూర్తి సౌకర్యాలతో సిద్ధం చేయాలని ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు ?ఇవసతిగృహాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. వసతుల కల్పనపై ఒక్క ఫిర్యాదూ రాకూడదు. ఆహారం, నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు సిద్ధంగా ఉండాలి. ఉన్నతాధికారులు వసతిగృహాల్ని నిరంతరం తనిఖీ చేయాల్సి అని స్పష్టం చేశారు. చంద్రబాబు సమీక్షలో ప్రధానాంశాలు..

స్వచ్ఛతకు తాడిపత్రి రోల్‌మోడల్

నగరాలు, పట్టణాల్లో మౌలిక సౌకర్యాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి. తాగునీటి పైప్‌లైన్లలో డ్రైనేజీ నీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తరచూ నమూనాలు సేకరించి పరీక్షించాలి. తాగునీరు, వీధి లైట్లు, డ్రైనేజి, చెత్త సేకరణ అంశాల్లో ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించి.. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునే వ్యవస్థ ఉండాలి. ఈ మేరకు కమిషనర్లకు మార్గదర్శకాలు జారీ చేయాలి. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమ ఫలితాలు పట్టణాల్లో కనిపించాలి. తాడిపత్రిలో పారిశుద్ధ్యంపై బాగా పనిచేస్తున్నారు. నాయకులు చొరవ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. స్వచ్ఛత విషయంలో తాడిపత్రి రోల్‌మోడల్.

**మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం**

సంక్షేమం, అభివృద్ధి, పెట్టుబడులకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో.. దానికి పదింతల ప్రాధాన్యం మహిళలు, చిన్నారుల భద్రతకు ఇస్తున్నాం. మహిళలపై నేరాల విషయంలో అలక్ష్యం వద్దు. వారి జోలికి రావాలంటే వణికిపోయే పరిస్థితి రావాలి.
గంజాయి నివారణకు రాష్ట్రంలో అమలు చేస్తున్న ఈగల్ విధానాన్ని ఒడిశా కూడా అవలంబిస్తోంది.

**గ్రామీణ నియోజకవర్గాల్లోనూ అన్న క్యాంటీన్లు**

పేదవాడికి కడుపునిండా అన్నం పెట్టడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్లను గ్రామీణ నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేయబోతున్నాం. కొత్తగా అన్న క్యాంటీన్లు ఏర్పాటైతే ఏడాదికి సుమారు రూ.200 కోట్లు ఖర్చవుతుంది. క్యాంటీన్లను అధికారులు తరచూ పరిశీలించాలి. స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చేలా ప్రోత్సహించాలి.

**చెరువులకు నీరు నింపడంలో అన్నమయ్య మోడల్**

చెరువులకు నీరు నింపే విషయంలో అన్నమయ్య జిల్లా మోడల్ అవలంబించాలి. అవసరమైతే అన్ని జిల్లాల నుంచి అక్కడకు బృందాల్ని పంపి శిక్షణ ఇప్పించండి. డ్రెయిన్లు, కాల్వలు బాగు చేయాలి. మే 15న సాగుకు నీటిని విడుదల చేస్తాం. దాన్ని దృష్టిలో పెట్టుకుని జలధార పనులు చేపట్టాలి. అర్బన్ ప్రాంతాల్లోనూ జలధార కార్యక్రమం చేపట్టాలి.

2

# 21వ శతాబ్దం మహిళలదే..

- కొత్త చరిత్రను లిఖించనున్నాం : ప్రధానమంత్రి
- ఏప్రిల్ 16 నుంచి ప్రత్యేక సమావేశాలు
- 2029 నుండి మహిళా రిజర్వేషన్ల అమలుకు పిలుపు



2



## పోరాడి సాధించుకున్నది ఎప్పటికీ గుర్తుండిపోతుంది

- దార్శనిక నాయకుడు చంద్రబాబు అద్భుతంగా అభివృద్ధి చేస్తారు
- అమరావతికి చట్టబద్ధతపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యాఖ్య
- చట్టబద్ధత కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి నారా లోకేశ్

"కోట్ల మంది ప్రజల కోరికైన అమరావతి చట్టం నా హయాంలో రూపొందడం సంతోషంగా ఉంది. రైతులు రాష్ట్రంపై ప్రేమతో రాజధాని నిర్మాణానికి భూములిచ్చారు. వారి త్యాగం వెలకట్టలేనిది. పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకుడు. ఆయన దూరదృష్టితో రాష్ట్రాన్ని, రాజధానిని అద్భుతంగా అభివృద్ధి చేస్తారన్న నమ్మకం ఉంది" అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. పార్లమెంటు ఆమోదించిన అమరావతి బిల్లుకు రాజముద్ర వేసినందున ధన్యవాదాలు తెలిపేందుకు ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలతో

2

## ఏపీలో పరిశ్రమల ఏర్పాటు మరింత సులభం...

### బ్రిటీష్ కాలం నాటి చట్టాల రద్దుపై చంద్రబాబు కీలక ఆదేశాలు



రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు, నిబంధనలను సులభతరం చేసేందుకు

6

# మరోమారు ఎదురు కాల్పులు

- మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి
- అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

2




## దేశంలో ఇస్లామిక్ రాజ్యం కోసం కుట్ర..

## ఏపీ ఉగ్ర కేసులో బయటపడ్డ షాకింగ్ నిజాలు!

- భారత్‌ను ఇస్లామిక్ రాజ్యంగా మార్చేందుకే 'గజ్వా-ఏ-హింద్' కుట్ర
- విజయవాడ ఉగ్ర కేసులో నిందితుల విచారణలో సంచలన విషయాల వెల్లడి
- సోషల్ మీడియా ద్వారా యువతను ఆకర్షిస్తున్న ఆఫ్ఘన్ మాస్టర్‌మైండ్
- దేశవ్యాప్తంగా విస్తరించిన నెట్‌వర్క్‌పై దృష్టి.. రంగంలోకి ఎన్ఐఏ



భారత దేశాన్ని ఇస్లామిక్ రాజ్యంగా మార్చడమే తమ లక్ష్యమని, ఇందుకోసం 'గజ్వా-ఏ-హింద్' (భారత్‌పై యుద్ధం) ప్రారంభించామని

2



## శ్రీకాకుళం రోడ్-తిరుపతి హమ్‌సఫర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

### పచ్చజెండా ఊపిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికుల చిరకాల కోరిక నెరవేర్చామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సోమవారం

2

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

### ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు

### ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన



2

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది.



2

## తట్టేపల్లి వద్ద ఘోర ప్రమాదం..

# ముగ్గురు మృతి

- స్కూటీని ఢీకొట్టిన లారీ
- ఘటనా స్థలంలోనే దంపతులతో పాటు చిన్నారి దుర్మరణం
- లొంగిపోయిన లారీ డ్రైవర్

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు



- ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు
- ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన

**వాషింగ్టన్, ఏప్రిల్ 13:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఇదిలా ఉండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

# ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణ

## హైకోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన కేజ్రీవాల్!

### న్యాయమూర్తిని మార్చాలని విజ్ఞప్తి.. ■ దర్యాప్తు సంస్థల తీరుపై సంచలన ఆరోపణలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణలో భాగంగా సోమవారం హైకోర్టులో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ నుండి జస్టిస్ స్వర్ణకాంత శర్మను తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్వయంగా హాజరై తన వాదనలు వినిపించారు. విచారణ ప్రక్రియలో పక్షపాతం ఉండవచ్చని కేజ్రీవాల్ కోర్టు ముందు ఆందోళన వ్యక్తం చేశారు. గత విచారణల సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలపై కోర్టు చేసిన వ్యాఖ్యలు, తనను ఒక దోషిగా మరియు అవినీతిపరుడిగా చిత్రీకరించేలా ఉన్నాయని ఆయన వాదించారు. ఈ నేపథ్యంలో నిష్పాక్షిక విచారణ కోసం న్యాయమూర్తిని మార్చాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలపై కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "ముందుగా సాక్షులను అరెస్టు చేయడం, ఆ తర్వాత ఇతరులను ఇరికించేలా వారి నుండి బలవంతంగా వాంగ్మూలాలు సేకరించడం ఈ సంస్థలకు అలవాటుగా మారింది" అని ఆయన ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే దర్యాప్తు సంస్థలు వ్యవహరిస్తున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో కేజ్రీవాల్‌ను రౌస్ ఎవెన్యూ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. అయితే, ఈ తీర్పును సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతోంది. కేజ్రీవాల్ దాఖలు చేసిన రెక్యూసల్ పిటిషన్‌పై స్పందించాలని కోరుతూ సీబీఐకి ధర్మాసనం తాజాగా నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఈ కేసులో కేజ్రీవాల్ స్వయంగా రంగంలోకి దిగి వాదించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## శ్రీకాకుళం రోడ్-తిరుపతి హమ్‌సఫర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

-మొదటిపేజీ తరువాయి

ఆమదాలవలసలో శ్రీకాకుళం రోడ్-తిరుపతి(17440) హమ్‌సఫర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ఆయన ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్‌లతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు కూటమి నాయకులతో కలిసి ద్విచక్రవాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. 'నేను ఎంపీగా ఎన్నికైనప్పటి నుంచి శ్రీకాకుళం నుంచి తిరుపతితో పాటు హైదరాబాద్‌కు నేరుగా రైలు సౌకర్యం కల్పించాలనుకున్నాను. పలుమార్లు రైల్వే మంత్రి, అధికారులను
కలిసి విన్నవించడంతో కల సాకారమైంది. త్వరలో ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక రైలు నడిచేలా కృషిచేస్తా' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్ఎం లలిత్ బొహ్రా, తెదేపా జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, రైల్వే అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం సాయంత్రం 4.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరునాడు మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌కు చేరుకుంటుంది. ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం రోడ్ నుంచి బయలుదేరి మరునాడు ఉదయం 8.10కి తిరుపతికి చేరుకుంటుంది.

## దేశంలో ఇస్లామిక్ రాజ్యం కోసం కుట్ర..
## ఏపీ ఉగ్ర కేసులో బయటపడ్డ షాకింగ్ నిజాలు!

-మొదటిపేజీ తరువాయి

విజయవాడ ఉగ్రలింకుల కేసులో అరెస్టయిన నిందితులు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఆల్ ఖైదా, ఐసిస్ వంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కొనసాగిస్తున్నామని, ఈ మార్గాన్ని తమకు ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన అల్ హకీం షకూర్ చూపించాడని వారు పోలీసు కస్టడీలో సంచలన విషయాలు చెప్పినట్టు సమాచారం.పోలీసుల విచారణలో నిందితులు మరిన్ని కీలక వివరాలు వెల్లడించారు. "భారత జాతీయ జెండా స్థానంలో ఐసిస్ జెండాను ఎగురవేయాలని, 'ఏ నేషన్ లెడ్ బై మహమ్మద్ విల్ నాట్ సరెండర్' వంటి నినాదాలతో యువతలో ఉగ్రవాద భావజాలాన్ని నింపేందుకు ప్రయత్నించాం. ఇస్లాంను విశ్వసించని వారిపై సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేశాం. జిహాద్ కోసం ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నవారిని గుర్తించే పనిని షకూర్ మాకు అప్పగించాడు. దేశంలోని స్లీపర్ సెల్స్‌తో త్వరలో పరిచయం చేస్తానని చెప్పాడు. కానీ, అంతలోనే మేం అరెస్టయ్యాం. ఇప్పటివరకు మేం అతన్ని చూడలేదు, ఎక్కడుంటాడో కూడా మాకు తెలియదు" అని నిందితులు చెప్పినట్లు తెలిసింది.

**దేశవ్యాప్తంగా విస్తరించిన నెట్‌వర్క్**

సోషల్ మీడియా ద్వారా యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించి, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌లకు పంపి మిలిటెంట్ శిక్షణ ఇప్పించాలని అల్ హకీం షకూర్ కుట్ర పన్నాడు. ఇందుకోసం 'బెన్ ఎక్స్ డాట్ కామ్' పేరుతో సోషల్ గ్రూపును ఏర్పాటు చేసి, దేశంలోని పలు రాష్ట్రాల యువతకు గాలం వేశాడు. ఈ దేశ వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచిన ఏపీ ఇంటెలిజెన్స్ అధికారులు గత నెలలో విజయవాడకు చెందిన మహమ్మద్ డానిష్, మహమ్మద్ రహంతుల్లా షరీఫ్, మీర్జా సోహైల్ బేగ్‌లను అరెస్టు చేయడంతో ఈ నెట్‌వర్క్ గుట్టురట్టయింది.వీరిచ్చిన సమాచారంతో హైదరాబాద్‌కు చెందిన సైదా బేగం, బళ్లారికి చెందిన అబ్దుల్ సలామ్, పాట్నాకు చెందిన షాద్మాన్ దిల్‌ఖ్‌ష సహా ఏడు రాష్ట్రాల్లో 11 మందిని అరెస్టు చేశారు. తాజాగా ఏపీ సీఐడీ అధికారులు షాద్మాన్ దిల్‌ఖ్‌షతో పాటు మరో ఆరుగురిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగియడంతో సోమవారం వారిని కోర్టులో హాజరుపరిచి, రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ విచారణలో మరో నాలుగు రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్ లింకులు ఉన్నట్లు, కీలకంగా వ్యవహరిస్తున్న 42 మంది వివరాలను అధికారులు గుర్తించారు. వీరిలో కొందరికి 25 నుంచి 40 వరకు వేర్వేరు పేర్లతో సోషల్ మీడియా ఖాతాలు ఉన్నట్లు కనుగొన్నారు.

# 21వ శతాబ్దం మహిళలదే..

- కొత్త చరిత్రను లిఖించనున్నాం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఏప్రిల్ 16 నుంచి ప్రత్యేక సమావేశాలు
- 2029 నుండి మహిళా రిజర్వేషన్ల అమలుకు పిలుపు

**న్యూఢిల్లీ:** మహిళా రిజర్వేషన్ చట్టంతో (నారీ శక్తి వందన్ అధినియం) ముడిపడిన సవరణ బిల్లు పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ముందుకు వస్తోందని, రిజర్వేషన్ బిల్లు మహిళలకు సముచిత స్థానం కల్పించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 21వ శతాబ్దంలో అతి కీలకమైన నిర్ణయం తీసుకోబోతున్నామని, పార్లమెంటు కొత్త చరిత్రను లిఖించేందుకు చేరువలో ఉందని చెప్పారు. ఢిల్లీలో సోమవారంనాడు నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. పాలనలో మహిళల భాగస్వామ్యానికి పెద్దపీట వేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నిరీక్షణకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలతో తెరపడనుందని మోదీ ప్రకటించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం మహిళలకు అంకితమని అన్నారు. 21వ శతాబ్దం మహిళలదేనని, మహిళా రిజర్వేషన్ చట్టం అమలుతో చిరకాల స్వప్నాల సాకారంతో పాటు భవిష్యత్ సంకల్పాలు నెరవేరుతాయని అన్నారు. సామాజిక న్యాయం కేవలం పురుషుల వల్ల మాత్రమే కాదని, భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో లింగ సమానత్వం, సామాజిక న్యాయం సాకారమవుతుందని పేర్కొన్నారు. 'మహిళా సాధికారతా బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ 2029 నుంచి అమలు చేయాలనే ఏకగ్రీవ డిమాండ్ ఉంది. 2029 గడువును దృష్టిలో ఉంచుని దీనిపై సమగ్ర చర్చను ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చేపట్టనున్నాం' అని మోదీ తెలిపారు. పరస్పర సహకారం, పార్టిసిపేషన్‌తో ఈ పని నిర్వహించాలని తమ అభిమతమని, ఈసారి కూడా ప్రతి ఒక్కరి సమష్టి కృషితో సభాగౌరవం సమున్నత శిఖరాలకు చేరుకోబోతుందని అన్నారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకూ మూడు రోజుల పాటు



మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపడిన సవరణలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేకంగా సమావేశమవుతోంది. 20029 నుంచి లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను కచ్చితంగా మహిళా రిజర్వేషన్లతో నిర్వహించుకుందామని ప్రధాని ఇప్పటికే పిలుపునిచ్చారు. ఇందుకోసం రాజకీయ పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి సవరణ బిల్లులను ఆమోదించాలని వివిధ పార్టీల లోక్‌సభ, రాజ్యసభాపక్ష నాయకులకు మోదీ లేఖ రాశారు. దేశ మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో ఎంపీలంతా ఏకమై మాట్లాడాలని, చరిత్రాత్మక మార్పునకు నాంది పలకాలని ఆ లేఖలో కోరారు.

## మరోమారు ఎదురు కాల్పులు
## మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి
## అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

**రాయ్పూర్, ఏప్రిల్ 13:** ఛత్తీస్ గఢ్ లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఎన్ కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్ గఢ్ లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్ కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అక్కడి నుంచి అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారు దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఉపయోగించి తప్పించుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. ఎన్కౌంటర్ అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరి కొంతమంది మావోయిస్టులు అటవీలో దాగి ఉండవచ్చనే అనుమానంతో ఆపరేషనన్ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయి. మావోయిస్టుల కదలికలపై గత కొంతకాలంగా భద్రతా బలగాలు నిఘా పెంచాయి. వారికి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ని చేపట్టినట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్ జాగ్రత్తగా కొనసాగుతోంది. ఈ ప్రాంతం గతంలో కూడా మావోయిస్టు కార్యకలా పాలకు కేంద్రంగా ఉంది. తరచూ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతు న్నాయి. మావోయిస్టులు ఉద్యమం ప్రభావం ఈ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోండటంతో భద్రతా సవాళ్లు నెలకొన్నాయి. ఎన్కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉ ండాలని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన మరికొంతమంది మావోయిస్టులను పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ మరికొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. మాచపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లో లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందడం, పలువురు తప్పించుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## తట్టేపల్లి వద్ద ఘోర ప్రమాదం.. ముగ్గురు మృతి

**ఘటనా స్థలంలోనే దంపతులతో పాటు చిన్నారి దుర్మరణం**

వికారాబాద్, ఏప్రిల్ 13: వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి శివారులో ఒక స్కూటీని లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలతో పాటు ఒక చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. మృతులు తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. పెద్దేముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35), ఆమె భర్త కవిరాజ్ (40) జహీరాబాద్ లో నివసిస్తున్నారు. వీరు ఆదివారం సాయంత్రం జహీరాబాద్ నుంచి తమ స్వగ్రామమైన రుక్మాపూర్ కు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా తట్టేపల్లి గ్రామ శివారులో లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు ఉన్న బాలుడు కార్తీక్ స్వల్ప గాయాలతో తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్ వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం పెద్దేముల్ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. గాయపడ్డ బాలుడు కార్తీక్ ను చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించడంతో రుక్మాపూర్ లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## బడులు తెరిచేనాటికి సంక్షేమ హాస్టళ్లలో వసతులు

-మొదటిపేజీ తరువాయి

కొత్త ఆవిష్కర్తలను తీర్చిదిద్దాలి

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వీలైనన్ని ఆవిష్కరణలు వచ్చేలా చూడాలి. విద్యార్థి దశ నుంచే ఆవిష్కరణలు చేయాలన్న ఆలోచనలు రేకెత్తించి.. యంగ్ స్టూడెంట్ ఇన్నోవేటర్లను తీర్చిదిద్దాలి.

అగస్త్య వంటి సంస్థలతో కలిసి ఆర్టీఐహెచ్ పనిచేస్తే మంచి ఫలితాలు రాబట్టవచ్చు. 175 నియోజకవర్గాల్లో ఉండే ఎంఎస్ఎంఈ పార్కులతో ఆర్‌టీఐహెచ్ అనుసంధానమై పనిచేస్తే ఎలా ఉంటుందో ప్రణాళికలు సిద్ధం చేయండి. ఎన్‌విడియా వంటి సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. తద్వారా ఒక ఎకోసిస్టం ఏర్పడుతుంది.

డ్రోన్ల ద్వారా ఆరోగ్య సేవలందించే ప్రాజెక్టును అల్లూరి, మన్యం, పోలవరం జిల్లాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టాలి.

## పోరాడి సాధించుకున్నది ఎప్పటికీ గుర్తుండిపోతుంది

-మొదటిపేజీ తరువాయి

కలిసి భేటీ అయినప్పుడు రాష్ట్రపతి వారితో ఈ మేరకు పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు-2026'కు రాష్ట్రపతి ఈ నెల 6న ఆమోదముద్ర వేసి.. చట్టరూపం కల్పించినందుకు కృతజ్ఞతగా మంత్రి లోకేశ్ సోమవారం మధ్యాహ్నం తెదేపా, భాజపా, జనసేన ఎంపీలతో రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదీ ముర్మును కలిసి ధన్యవాదాలు తెలిపారు. అమరావతిని అజరామరంగా నిలబెట్టినందుకు ఐదు కోట్ల మంది ఆంధ్రుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. "విభజనతో ఏపీ కోలుకోలేని విధంగా నష్టపోయింది. ఈ సమయంలో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లుకు దేశంలోని అన్ని పార్టీలూ మద్దతు పలికాయి. దానికి మీరు రాజముద్ర వేసి అమరావతికి శాశ్వతత్వం కల్పించినందుకు ప్రపంచవ్యాప్తంగా ఆంధ్రులు జేజేలు పలుకుతున్నారు. మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్... మా రాజధాని అమరావతి అని ఆంధ్రజాతి సగర్వంగా చెప్పుకొనేలా చేశారు. అందుకోసం ఆంధ్రులందరి తరఫున కృతజ్ఞతలు" అని రాష్ట్రపతితో లోకేశ్ అన్నారు. అనంతరం అమరావతి చరిత్ర, సంస్కృతి, రైతుల భూముల త్యాగం, రాజధానిలో చేపట్టిన అభివృద్ధి పనులు, గత ప్రభుత్వ పాలనలో ఎదురైన ఇబ్బందులు, 1,631 రోజులపాటు సాగిన రైతు ఉద్యమాల గురించి వివరించారు. ఇప్పుడు మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్మాణాలు పూర్తయితే అమరావతి రాజధాని ఎలా ఉంటుందో సూచించే చిత్రాలను ఆయన రాష్ట్రపతి ముందు ప్రదర్శించారు. నిర్మాణ విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఎంపీలతో కలిసి రాష్ట్రపతికి అందించారు. అనంతరం ద్రౌపదీముర్ము.. 'పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది" అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాజపా ఎంపీ సీఎం రమేశ్, జనసేన నాయకుడు వల్లభనేని బాలశౌరితో పాటు తెదేపా ఎంపీలంతా పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడాలి.

## నారీ శక్తి వందన్ సమ్మేళనంలో జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్.





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 13**: మహిళా సాధికారతకు మరింత బలమైన అడుగులు వేస్తున్నామని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ పిలుపు నిచ్చారు. సోమవారం దిల్లీ లోని విజ్ఞాన్ భవన్ లో మహిళా సాధికారత, నాయకత్వం పై నిర్వహించిన సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఢిల్లీ ముఖ్య మంత్రి రేఖ గుప్తా, కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్న పూర్ణ దేవి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ మహిళల పాత్రను వికసిత భారత్ 2047 దిశగా మరింత బలోపేతం చేస్తుందన్నారు. గ్రామ స్థాయి నుండి పార్లమెంట్ వరకు మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించడమే ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.

అనకాపల్లి కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాల్ నుండి వర్చు వల్ గా పాల్గొని వీక్షించిన జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, ఐ.సి.డి.ఎస్, డి.ఆర్డి.ఎ పథక సంచాలకులు సూర్య లక్ష్మి, శచి దేవి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ హైమవతి, డి సి పి ఓ రమేష్, స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఉండే పిల్లలకు పెట్టె ఆహారం నాణ్య మైశీదిగా ఉండాలన్నారు. పిల్లలకు మీరు ఆహారం పెట్టినప్పుడు ఎలా ఉంది బాగుందా, లేదా అని అడగాలన్నారు. పిల్లలకు ఆహారం ఇష్టంగా పెట్టాలని అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు సూచించారు. తమ పిల్లలను మీ చేతుల్లో పెట్టె తల్లికి నమ్మకం కలిగేలా మీరు పిల్లలకు తల్లిలానే చూసుకోవాలని, పిల్లల ప్రేమ పొందడం, వారికి మన ప్రేమను పంచినప్పుడే మనసుకు ప్రశాంతత, బాధ్యతల పట్ల గౌరవం పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కేంద్రాలను కాన్వెంట్ ల్లా తయారు చేయాలని అప్పుడే పిల్లలు అంగన్వాడీ కేంద్రాల్లో ఆనందంగా ఉంటారన్నరు. అంగన్వాడీ కేంద్రంలో పని చేసే సిబ్బందికి అనారోగ్య సమస్య వస్తే గ్రామం మొత్తం మన వెంటే ఉండేలా గ్రామస్తులతో సిబ్బంది మమేకమవ్వాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అవకాశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడితే కుటుంబం, గ్రామం, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, శిక్షణా కార్యక్రమాలు, మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకుంటే మహిళలు ఆర్థికంగా మరింత బలపడతారని తెలిపారు. మహిళల విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో బాలికల విద్యాభివృద్ధికి చేపడుతున్న చర్యలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న కార్యక్రమాలు, మహిళలపై జరిగే వేధింపుల నివారణకు ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలపై పని తీరు పై జాయింట్ కలెక్టర్ సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహిళలు తమ హక్కులు, అవకాశాల పై అవగాహన పెంచుకుని సమాజంలో నాయకత్వాన్ని చేపట్టాలని సూచించారు.

నారీ శక్తి వందన్ సమ్మేళనం మహిళలకు కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తుందని, మహిళల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, ప్రభుత్వంతో పాటు సమాజం కూడా మహిళా సాధికారతకు సహకరించాలని పిలుపునిచ్చారు. మహిళలు స్వీయ నమ్మకంతో ముందుకు సాగితే దేశ అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.



# మెడికల్ క్యాంపునకు విశేష స్పందన





**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 13:** పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో మెడికవర్ మరియు వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. సోమవారం నక్కపల్లి మండలం ఎన్ .నరసాపురం గ్రామంలో మెగా మెడికల్ క్యాంపు సి పి ఎం నాయకులు మనబాల రాజేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం అప్పలరాజు హాజరయ్యారు.బీపీ, షుగరు, గుండె జబ్బులు వయసుతో సంబంధం లేకుండా చాలా మందికి వస్తుందని దీనిని ప్రారంభ దశలో గుర్తించి తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అప్పలరాజు అన్నారు. మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ రాజు మాట్లాడుతూ ఈ పరీక్షలతో పాటు క్యాన్సర్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని క్యాన్సర్ని ప్రారంభ దశలో గుర్తిస్తే సంపూర్ణంగా చికిత్స జరుగుతుందని తెలియజేశారు. పుష్పగిరి హాస్పిటల్స్ వారు కంటి పరీక్షలు నిర్వంచి కంటి ఆపరేషన్లు అవసరం అయిన వారిని గుర్తించి మంగళ వారం ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు.అలాగే ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు చంద్రమౌళి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు పూర్తి స్థాయిలో లేనందున ప్రైవేటు హాస్పిటల్స్ వైద్యుల సహాయంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పల్లా చినబ్బాయి, మనబాల గంగరాజు, గట్టేం గణేష్ మనబాల కొండబాబు, సారిపల్లి లోవరాజు, గొర్ల రమణ బాబు, చొప్పు మంగరాజు, మనబాల శ్రీను, వియ్యపు అప్పారావు, కొల్లి బుజ్జి, పెద్ద ఎత్తున్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు .

# ఉపమాక వెంకన్న ఆలయ ప్రాంగణంలో మాంసాహార విందు



పోలీసులకు ఫిర్యాదు చేసిన టిడిపి నాయకులు

**నక్కపల్లి, పెన్ సత్తా,ఏప్రిల్ 13:** ఉత్తరాంధ్రలో ప్రాచీన క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఉపమాక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మాంసాహార విందు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు నక్కపల్లి పోలీస్ స్టేషన్ లో సోమవారం సి ఐ మురళికి ఫిర్యాదు చేశారు. ఆలయ ప్రాంగణంలో వివాహాలు జరుగుతున్న సందర్భాల్లో సంప్రదాయంగా శాఖాహార విందు భోజనాలు మాత్రమే ఏర్పాటు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆదివారం రాత్రి ఎస్. రాయవరం మండలానికి చెందిన వైసిపీ నాయకుడు, వైస్ ఎంపీపీ అప్పన్న సోదరుడి వివాహ వేడుకల్లో భాగంగా ఆలయ సన్నిధిలోనే మాంసాహార విందు ఏర్పాటు చేశారు. ఈ ఘటనతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై స్పందించిన పాయకరావుపేట టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, ఆలయ ప్రాంగణంలో మాంసాహారం విందు ఏర్పాటు చేయడం అత్యంత దారుణమని మండిపడ్డారు. వెంటనే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, ఉపమాక సర్పంచ్ వీరబాబు పాయకరావుపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు షేక్ మునిసా బేగం,వాసు తదితరులు పాల్గొన్నారు.

# నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి హెటిరో జనరేటర్ వితరణ





**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 13:** మండల కేంద్రం నక్కపల్లి 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కి హెటిరో సౌజన్యంతో 30కెవి జనరేటర్ ఏర్పాటు చేశారు.సోమవారం పరిశ్రమ ప్రతి నిధులు ఎస్ కుల్లారెడ్డి, ఎం ఎన్ సుబ్బారెడ్డి, మెడికల్ ఆఫీసర్ వీరనారాయణ, వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ లతో కలసి జనరేటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెటిరో ప్రతినిధులు మాట్లాడుతూ నక్కపల్లి గవర్నమెంట్ హాస్పిటల్ కు గతంలో అదునూతన పరికరాలు అందించడం జరిగిందన్నారు.అదే విదంగా హాస్పిటల్ యాజమాన్యం విన్నపం మేరకు రూ. 8 లక్షల తో 30కెవి జనరేటర్ హెటిరో పరిశ్రమ నిధులనుండి అందిచడం జరిగిందని తెలిపారు. వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ హెటిరో పరిశ్రమ యాజమాన్యం అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు. పరిశ్రమ ద్వారా మండలంలో అనేక గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం ఆనంద దాయకమన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్ డెంట్ సునీల్, సి ఎస్ ఆర్ టీం ప్రతినిధి సిహెచ్ శ్రీనివాస్,హెటిరో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధ్వంసం అయిన కోటిపల్లి రాములవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 13:**దేవాదాయ ధర్మాదాయ శాఖ విజయనగరం జిల్లా రామ తీర్థం నుండి దెబ్బతిన్న స్వామి వారి, అమ్మవారి విగ్రహాలను కోటిపల్లి గోదావరి నదిలో నిమజ్జనం కొరకు ఆలయ వద్ద నుండి బయలుదేరిన స్వామి వాహనం విజయనగరం మీదుగా అనకాపల్లి బైపాస్ రోడ్ తోటాడ జంక్షన్ వద్ద సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీనూకాంబిక అమ్మవారి దేవస్థానం తరుపున దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, జిల్లా సహాయ కమిషనర్, ఆలయ కార్య నిర్వహణ అధికారి, ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తజన సందోహం మధ్య రాములవారి జీర్నార్ధన నిమర్జనం కొరకు వెళుతున్న విగ్రహాలకు హైవే లో అమ్మవారి ఆర్చి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రథం ఇక్కడ నుండి కోటిపల్లి గోదావరి నదికి చేరుకుంటుంది.

ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత, జిల్లా సహాయ కమి కె.ఎల్ సుధారాణి, ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, వివిధ ఆలయాల ఈవోలు, ఆలయాల సిబ్బంది,

ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు,

కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం




**చేగుంట : పెన్ సత్తా, ఏప్రిల్ 13:** చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల లో ప్రతిభ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ తెలిపారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో పల్లవి కి 953, మాదేహ అస్మాన్ కు 945,కంప్యూటర్ సైన్స్ లో హేమలత 953,సారిక 931,ఎంపీసీ మొదటి సంవత్సరం నవ్య 451, ఇందుశ్రీ ,449,కార్తీక్ హెచ్ ఈ సి లో 441, మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ .ప్రతిభ సాధించిన విద్యార్థులకు కళాశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## స్వీయ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాలను రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు

- ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి.
- ఎస్పీ రోహిత్ రాజు




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పాల్వంచ పెన్ సత్తా, ఏప్రిల్ 13:**,పోలీసుల ఆధ్వర్యంలో ఎం సి బి టి ఐటిఐ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన అరివె- ఆలివ్ అవగాహనా కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎస్పీ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, ప్రజలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అ్రరివే- ఆలివ్-2026 కార్యక్రమంలో భాగంగా సోమవారం పాల్వంచ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కళాశాల నందు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు.ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరు రోజుల పాటు రోడ్డు ప్రమాదాలను నియంత్రిండానికి ఏర్పాటు చేసిన అరీవే ఆలివ్ క్యాంపెయిన్-2026లో భాగంగా సోమవారం నాడు విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్దినీ,విద్యార్థులు పాల్గొన్నారు.సుమారుగా 300 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. ఎస్పీతో పాటు కొత్తగూడెం మున్సిపల్ కమీషనర్ సుజాత,ఆర్టీఓ వెంకటరమణ,స్థానిక కార్పొరేటర్ నూకల సరిత,మెడికల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్,మొహమ్మద్ అలీ,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్,ఎస్సైలు నాగరాజు జీవన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి విద్యార్థులకు వివరించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే రోడ్డు ప్రమాదాలను నియంత్రిచ్చవచ్చని అన్నారు.రోడ్డుపై విధులలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా,లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ,నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించే విధంగా సివిక్ సెన్స్ ను కలిగి ఉండాలని కోరారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి తమ ప్రాణ భద్రతతో పాటు,ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల ఆశయాలకు తగ్గట్టుగా నడుచుకుంటూ మంచిగా చదువుకుని క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని అకాక్షించారు.అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు.

## రోడ్డు భద్రత పై అవగాహనా

- ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని
- చింతకాని ఎస్సై వీరేందర్



**చింతకాని పెన్ సత్తా, ఏప్రిల్ 13: ప్రతినిధి.**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, మరణాల రేటును తగ్గించేందుకు రోడ్డు భద్రత నియమాలు పాటించేలా ప్రజలను సమాయత్వం చేసేందుకు ఈరోజు చింతకాని మండల కేంద్రంలో గ్రామపంచాయతీ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం అరైవ్ అలైవ్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకాని నుండి జగన్నాధపురం వెళ్లే మార్గమధ్యంలో రోడ్లపై అడ్డుగా వున్న చెట్ల పొదలను తొలగించి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టినట్లు

ఈ కార్యక్రమంలో వైరా సీఐ వెంకట ప్రసాద్, చింతకాని సర్పంచ్ మనోహర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో రోడ్డు సేఫ్టీ కమిటీలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

# జీవిఎంసిలో రోడ్డెక్కిన పెట్రోల్ పంపు!



- ఆదాయానికి టిపిబివో తలుపులు..
- అక్రమ నిర్మాణం పై ఎసిబికి ఫిర్యాదు!!




**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 13;** జివిఎంసి 79 వ వార్డు దేశపాత్రునిపాలెంలో పెట్రోల్ పంపు రోడ్డెక్కింది. విఎంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇక్కడి రహదారి 60 మీటర్లుగా నమోదైంది. మాస్టర్ ప్లాన్ రహదారిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ఎపి బిల్డింగ్ రూల్స్ స్పష్టం చేస్తున్నాయి. అలాగే ఈ నిబంధనల ప్రకారం ప్లాన్ అప్రూవల్ లేకుండా ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదు. కాని దేశపాత్రునిపాలెంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ఎటువంటి ప్లాన్ అప్రూవల్ లేకుండానే ఇన్‌చార్జ్ టిపిబివో తలుపులు నాయుడు మేనేజ్ చేస్తున్నారు. టిపిబివోకు ఎసిపి వెంకట్రావు అండ దండలు అందించడంతో ఎటువంటి ప్లాన్ అప్రూవల్ లేకుండా అక్రమ నిర్మాణాన్ని అనుమతించారు. అయితే ఈ అక్రమ నిర్మాణం పై ఎసిబి డైరక్టర్ కు స్థానికులు ఫిర్యాదు చేశారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీగా ఉన్న తలుపులు నాయుడిని ఇన్‌చార్జ్ టిపిబివోగా నియమించడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని స్థానికులు ఆ ఫిర్యాదులో పేర్కొంటున్నారు. అలాగే మరో నెలలో రిటైర్ కాబోతున్న ఎసిపి కె.వెంకట్రావు ఇష్టారాజ్యంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పెట్రోల్ బంక్ నిర్మాణానికి సంబంధిత అయిల్ కంపెనీ అనుమతులతో పాటు రాష్ట్ర పౌరసరఫరాలు, ఫైర్, లీగల్ మెట్రాలజీ, పోలీస్, స్థానిక సంస్థల అనుమతులు తప్పని సరి. దేశపాత్రునిపాలెంలో నిర్మితమవుతున్న పెట్రోల్ బంక్‌కు ఎటువంటి ప్లాన్ అప్రూవల్ లేకున్నా నిర్మాణానికి అనుమతివ్వడం వెనుక టిపిబివో తలుపుల నాయుడితో పాటు, ఎసిపి వెంకట్రావు విధి నిర్వహణలో అవినీతికి పాల్పడటమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. అక్రమంగా పెట్రోల్‌బంక్ మాస్టర్‌ప్లాన్ రోడ్డులో నిర్మిస్తున్నా చర్యలు తీసుకోక పోవడం పట్ల స్థానికులు ఎసిబి దర్యాప్తును కోరుతూ ఫిర్యాదు చేశారు. జివిఎంసి పరిధిలో నిర్మాణాలు చేపట్టాలంటే బిల్డింగ్ లైసెన్స్, వుడా డవలప్ మెంట్ చార్జీలు, లేబర్ సెస్ ఇలా అనేక ఫీజులు చెల్లించాలి. వీటికి అదనంగా 14 శాతం ఒపెన్ స్పేస్ కంట్రీబ్యూషన్ చెల్లించాలి. అలాగే ప్రతిపాదిత ప్లాట్ విస్తీర్ణం 500చ.మీ.కు తక్కువ కాకుడదన్న నిబంధన ఉంది. అంతకు మించి మాస్టర్‌ప్లాన్ రహదారి ప్రభావిత ప్రాంతాన్ని అర్బన్ లోకల్ బాడీ జివిఎంసికి గిఫ్ట్‌గా ఇవ్వాలన్న నిబందన ఉంది. ఈ నిబంధనలు కారణంగా ఇక్కడి పెట్రోల్ బంక్‌ను అనుమతించడం సాధ్యం కాదని చెప్పి ఇన్‌చార్జ్ టిపిబివో తలుపులు నాయుడు అక్రమ మార్గంలో అనుమతించడం ఎసిబి ఫిర్యాదుకు కారణంగా చెబుతున్నారు. నిజానికి 300 చ.మీ.దాటిన నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టిపివో)పర్యవేక్షిస్తారు. అయితే ఇక్కడ ఎసిపి వెంకట్రావు అండదండలతో టిపిబివో అక్రమ నిర్మాణానినికి అన్ని అనుమతులున్నాయని నమ్మబలకడం స్థానికుల ఆగ్రహానికి కారణ మైంది. ఇది ఇలా ఉండగా ప్రస్తుత గాజువాక జోన్ ఎసిపి కె.వెంకట్రావు మరో నెల రోజుల్లో పదవీ విరమణ చేయనున్నారు. అయన గతంలో గాజువాక టిపివోగా పనిచేసిన కాలంలో ప్రస్తుత 79 వ వార్డు పరిధి లోని తుంగ్లాం రెవెన్యూలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూమికి 3 కోట్ల రూపాయలు టిడిఆర్‌లు మంజూరు చేసినట్టు ఎసిబికి ఫిర్యాదు చేశారు. ఇక్కడ మాస్టర్ ప్లాన్ రహదారి లేకున్నా టిడిఆర్ మంజూరు చేసి జివిఎంసికి తీవ్ర నష్టం కల్గించారని ఆతనిపై ఎసిబి అధికారులతో తక్షణం దర్యాప్తు చేయించాలని స్థానికులు ఫిర్యాదులో కోరారు.

# అభివృద్ధిని చేతల్లో చూపిస్తా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.




### ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఉచిత సోలార్.

**గన్నవరం, పెన్ సత్తా, ఏప్రిల్ 13:**తాను మాటల మనిషి కాదని, తను చేసే అభివృద్ధిని చేతల్లో చేసి చూపిస్తున్నానని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సోమవారం ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అలాగే 'ప్రజా దర్బార్' నిర్వహించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక భారం లేకుండా సౌర విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఒక్కో ఇంటికి సుమారు రూ.1.20 లక్షల వ్యయంతో 2 కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ వ్యవస్థను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా రోజుకు సుమారు 16 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, తక్కువ ఎండ ఉన్న రోజుల్లో కూడా 8 యూనిట్లు లభిస్తాయని వివరించారు. నెలకు 200 యూనిట్ల లోపు వినియోగం ఉన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తేలప్రోలులో 357 మందికి, ఉంగుటూరు మండలంలో 1973 మందికి, బాపులపాడు మండలంలో 2074 మందికి ఈ పథకం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తేలప్రోలు గ్రామంలో రూ.60.70 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులకు కేటాయించినట్లు తెలిపారు. అలాగే జల్ జీవన్ మిషన్ పథకం కింద దాదాపు రూ.8 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశ మై సీ-డాక్ డేటా సెంటర్‌ను గన్నవరం నియోజకవర్గానికి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను వారి ముంగిటకే వెళ్లి పరిష్కరించాలనే లక్ష్యంతో గ్రామాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. సోమవారం ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించి, సమస్యలను శ్రద్ధగా విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. గ్రీవెన్స్ పరిష్కారం లో గన్నవరం నియోజకవరం ను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ప్రత్యేక అధికారి షేక్ షాహిద్ బాబు, ఎంపీడీఓ సత్య కుమార్, ఎమ్మార్వో విమలాకుమారి, గన్నవరం ఏయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, ఏపీ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, ఎన్.ఎస్.పి ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, పి.ఏ.సి.ఎస్ చైర్ పర్సన్ అరుమళ్ళ కృష్ణారెడ్డి, తేలప్రోలు గ్రామ టిడిపి అధ్యక్షులు భీమవరపు వెంకటరెడ్డి, గొడ్డళ్ల చిన్న రామారావు, కొండేటి వెంకటేశ్వరరావు, కుందేటి చంద్రశేఖర్, రాజబోయిన శివాజీ, గులిపల్లి సందీప్, నిమ్మకూరి మహేష్, లంకా సత్తిబాబు, బెజవాడ నాగేశ్వరరావు, తాటిపాముల నాగయ్య, వంగా అయ్యప్ప రెడ్డి, యర్రగుంట్ల వినోద్ కుమార్, కొలవెంటి నాగబాబు, నక్కా వెంకటేశ్వరరావు, తుమ్మల లత, పొట్లూరి భువనేశ్వరి, జైపాల్ రెడ్డి, జాస్తి రాధిక, ఉయ్యూరు మురళి, పోతినేని రామకృష్ణ, పోతినేని వెంకట బాపయ్య చౌదరి, అట్లూరి నాని, మున్నా రామకృష్ణ, పైడిముక్కల విజయ్, కొమ్మారెడ్డి రాజేష్, మొవ్వ వేణుగోపాల్, అట్లూరి శ్రీనివాసరావు, నక్కా నాగరాజు, కర్రా ప్రసాద్ పాల్, అన్నే హరికృష్ణ, కోడె రేవంత్, మల్లారెడ్డి కిషోర్, చల్లగుల్ల సందీప్, కొసరాజు సాయిరాం, పరుచూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన టెమ్రీస్ నారాయణఖేడ్ జూనియర్ కళాశాల విద్యార్థిని : ఆమెన తబస్సుం



**సంగారెడ్డి పెన్ సత్తా, ఏప్రిల్ 13:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ ఫలితాల్లో బై.పి.సి (దీఊజ) ఆంగ్ల మాధ్యమం విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి, నారాయణఖేడ్ లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థిని ఆమెన తబస్సుం కల్హేర్ మండలం సంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచింది. తన నిరంతర కృషి, అంకితభావంతో ఆమె ఈ అరుదైన ఘనత సాధించింది. ఆమెన తన పదో తరగతిలో 10/10 ఉూా సాధించగా, ఇంటర్ మొదటి సంవత్సరంలో 437/440 మార్కులు, తాజాగా వెలువడిన ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 994/1000 అత్యధిక మార్కులను సొంతం చేసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆమె సాధించిన ఈ మార్కులు ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాయి. తన విజయం వెనుక తల్లిదండ్రులు ఇంతియాజ్ బేగ్ , ఆయేష బేగం ప్రోత్సాహం మరియు కాలేజీ ప్రధానోపాధ్యాయురాలు డి.మంజుల ,ఇతర ఉపాధ్యాయులు అందించిన బోధన ఉందని విద్యార్థిని తెలిపింది. భవిష్యత్తులో డాక్టర్ అయి, గ్రామీణ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని ఆమె వెల్లడించింది."మీ అద్భుతమైన రచన శైలి మరియు అంకితభావంతో మీరు ఈ స్థాయికి చేరుకోవడం గర్వకారణం. ఆమే భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటున్నారు తల్లిదండ్రులు.

"మీ విజయం నిరంతరం కొనసాగాలి. మీరు ఇంకా ఉన్నత స్థానాలకు చేరాలి."

## అబ్బా.. మినీ వాటర్ ప్లాంట్



**పెన్ సత్తా, ఏప్రిల్ 13:** పెబ్బేర్ పరిధిలో మూడో వార్డులో ఉన్న మినీ వాటర్ ప్లాంట్ పేరుకే మినీ వాటర్ ప్లాంట్ పనిలో జీరో పనిచేయక చాలా నెలలు కాబోతున్న పట్టించుకునేవారు లేకపోయారు. మూడో వార్డులో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నాం అని .. తక్షణమే మున్సిపాలిటీ అధికారులు, తక్షణమే వాటర్ ప్లాంట్ పనిచేసే విధంగా శ్రద్ధ వహించాలని మూడో వార్డు ప్రజలు కోరడం జరిగింది..

## వారిధాన్యం కొనుగోలు కేంద్రాని ప్రారంభించిన సర్పంచ్, సాయి కుమార్

- సన్న వడ్లలకు 500 బోనస్



**చేగుంట పెన్ సత్తా, ఏప్రిల్ 13::**రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణ కారిక్రమం,చేగుంట మండల వడియారం గ్రామంలో,ధాన్యం కొనుగోలు కేంద్రానీ ప్రారంబించిన సర్పంచ్, వారు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధరతో పాటు పారదర్శకంగా చెల్లింపులు అందేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు గ్రామీణ రైతులకు పెద్ద ఊరటనిస్తున్నాయని వడియారం సర్పంచ్ సాయి కుమార్ గౌడ్ తెలిపారు.

సోమవారం మండలంలోని వడియారం గ్రామంలో ఐకేపీ, సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుంది, రైతులు దళారుల చేతిలో మోస పోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ,సొసైటీల ద్వారా సెంటర్లను ప్రారంబిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం లో తేమ శాతం 17కి మించకుండా ఉండాలని బాగా ఎండబెట్టి తాలు మట్టి లేకుండా ఉండే విధంగా చూడాలన్నారు.తూకం వేసిన తర్వాత ఆన్లైన్ లో అప్లోడ్ కాగానే 24 గంటల్లో రైతు ఖతాల్లో డబ్బులు

జమ చేయడం జరుగుతుందన్నారు. ఎ గ్రేడ్ రకం మద్దతు ధర రూ.2389, సాధారణ రకం రూ.2369 తో పాటు సన్న రకం ధాన్యంకు అదనంగా బోనస్ 500 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగుంట సొసైటీ సీఈఓ సందీప్, పంచాయితీ కార్యదర్శి విజయ్ పాల్ రెడ్డి, ఐకేపీ సీసీ శ్వేతా, డైరెక్టర్ రమేష్, పాలకవర్గ సభ్యులు గయాజ్, అనిల్, గ్రామ నాయకులు రాజు, నదీమ్ ,మహేష్ నిర్వహకులు అశోక్, లక్ష్మణ్ రైతులు పాల్గొనారు,

# మృత్యుపాశాల్లా వేలాడుతున్న 11 కేవీ తీగలు

- ప్రమాదం జరిగాకే స్పందన -- ముందస్తు చర్యలు ఎక్కడ?"
- తీగలు తొలగించాలంటే డబ్బులా? మరి ప్రాణాల విలువ ఎంత చెప్పండి!
- వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు... తొలగించాలంటే డబ్బులు డిమాండ్
- ప్రాణహాని మధ్య కూలీలు పనులు -- అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం





**ఏన్కూరు పెన్ సత్తా, ఏప్రిల్ 13:** ఏన్కూరు మండలం నాచారం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 437లో రైతు బానోత్ పంతులు గల వ్యవసాయ పొలంలో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు తీవ్ర ప్రాణహాని పరిస్థితులు సృష్టిస్తున్నాయి. కరివేపాకు తోట మధ్యగా పోల్ నెంబర్లు 70–72 మధ్య సుమారు అర కిలోమీటర్ మేర ఈ తీగలు నిరుపయోగంగా ఉండి నేలకు దగ్గరగా వేలాడుతున్నాయి.

గాలి, వర్షాల సమయంలో మరింత దిగువకు వంగి ప్రమాదకరంగా మారుతున్న ఈ తీగలు ఎప్పుడైనా ప్రాణాంతక ప్రమాదానికి దారి తీసే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులను సంప్రదించినప్పటికీ, "అక్కడ ఎలాంటి సమస్య లేదు" అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. సమస్యను వివరించినా సీరియస్‌గా తీసుకోకుండా తేలికగా కొట్టేస్తున్నారని వాపోతున్నారు.

ఇక ఈ తీగలను తొలగించాలని కోరితే డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్న సమస్యను కూడా లాభాపేక్షతో చూడటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

పొలంలో ప్రతిరోజూ 20 నుంచి 30 మంది కూలీలు వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. నేలకు దగ్గరగా ఉన్న హైటెన్షన్ తీగలు ఎప్పుడైనా తగిలే ప్రమాదం ఉండటంతో కూలీలు భయాందోళనకు గురవుతున్నారు.

అదే సమయంలో, ఎండాకాలం కావడంతో పశువులను మేతకు వదిలే పరిస్థితి ఎక్కువగా ఉంటుంది. ఈ పొలాల పరిసర ప్రాంతాల్లో పశువులు స్వేచ్ఛగా తిరుగుతూ ఉండగా, వేలాడుతున్న విద్యుత్ తీగలు వాటికి కూడా ప్రాణహాని కలిగించే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. అనుకోకుండా తీగలు తగిలితే పశువులు మృతి చెందే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

"ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు?" అంటూ స్థానిక రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలు, పశువుల భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిరుపయోగంగా ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలను తొలగించి ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు. లేకపోతే ఈ నిర్లక్ష్యం ఎప్పుడైనా విషాదానికి దారి తీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## రోడ్డు భద్రతపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన -- ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యం.



జిల్లా కలెక్టర్ అంకిత్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 13:**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా సోమవారం చుంచుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు డీ–అడిక్షన్ మరియు కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటు లోకి తీసుకువచ్చామని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వాములుగా చేసుకుంటూ అవగాహన కల్పిస్తున్నామని అన్నారు . రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమని అన్నారు . ఈ గ్రామసభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించడం, రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

అలాగే ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా, సమీప ఆసుపత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా ఈ గ్రామసభల ద్వారా సమీక్షిస్తున్నామని వివరించారు.

పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన విషయం కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు.

కొన్ని జిల్లాల్లో అమలు చేస్తున్న "నో హెల్మెట్ -- నో ఎంట్రీ" వంటి వినూత్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, అలాంటి ఆలోచనలను మన జిల్లాలో కూడా అనుసరించాలని సూచించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని , వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు.

అన్ని శాఖలు సమన్వయంతో ఈ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, తాసిల్దార్ నాగరాజు, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తిర్లాపురం గ్రామంలో'అరైవ్ అలైవ్' ప్రోగ్రామ్.రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం





**చింతకాని పెన్ సత్తా, ఏప్రిల్ 13:** ప్రతినిధి.చింతకాని మండలం తిర్లాపురం గ్రామం పంచాయతి కార్యాలయంలోని చింతకానిపోలీసుల ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు అధ్యక్షతన సోమవారం 'అరైవ్ అలైవ్' రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలోభాగంగా గ్రామస్థాయిలో రోడ్డు సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు దెబ్బతింటున్నాయని, ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు.

మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాలు, ఎండలు, విపత్తులు.. ఏ పరిస్థితుల్లోనైనా పోలీసులు ప్రజల కోసం అంకిత భావంతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు.

పడినచోట ప్రమాదాన్ని చూసిన వెంటనే సహాయం చేసే వారికి పోలీసులు గౌరవం అందిస్తున్నారని, ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని తెలిపారు.

'అర్రివ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో, యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే కాకుండా, ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరాన్ని కూడా స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, గ్రామ సెక్రెటరీ ఉమారాణి, గ్రామ ఉపసర్పంచ్, గోగుల నాగమణి నరసింహారావు, గోద రాధమ్మ, వెంకయ్య, రాములు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణ.





**వలిగొండ మండలం పెన్ సత్తా, ఏప్రిల్ 13:**యాదాద్రి భువనగిరి జిల్లా ముదిగొండ మండల పరిధిలో కేర్చిపల్లి గ్రామంలో దొడ్డి కొమరయ్య విగ్రహ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు, తెలంగాణ ప్రభుత్వం విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య గారు, తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు క్యామ మల్లేష్ గారు,మాజీ మార్కెట్ చైర్మన్ కునపూరి కవిత గారు, గ్రామ సర్పంచ్ మద్దెల మంజుల నాగరాజు గారు , ఉప్ప సర్పంచ్ దయ్యాల మల్లేశం, పెద్ద కురుమ దయ్యాల యాదయ్య, శేలోజు చిన్నం శ్రీరాములు, కురుమ సంఘం అధ్యక్షులు బర్మా బుచ్చయ్య, కురుమ సంఘం సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొనీ విజయవంతం చేశారు.

## కొత్తవారికి అవకాశం ఇవ్వండి ఎమ్మెల్యేకు విన్నపం.



**వలిగొండ మండలం పెన్ సత్తా, ఏప్రిల్ 13:**నేను అనగా వలిగొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్యను పత్రిక విలేకరులకు తెలియజేయునది ఏమనగా నేను గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతూ పార్టీకి సేవలు అందించాను కానీ కొన్ని నా వ్యక్తిగత కారణాల వల్ల పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నాను పార్టీకి పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు నేను ప్రస్తుతం సిద్ధంగా లేనందున నేను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నానని పత్రికా మిత్రులకు తెలియజేస్తున్నాను,

ఇప్పటి వరకు నాకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ మిత్రులకుకృతజ్ఞతలుతెలియజేస్తున్నాను కాంగ్రెస్ పార్టీ వలిగొండ మండలం పట్టణ అధ్యక్షులు కనుకల కిష్టయ్య.

# ఏపీలో పరిశ్రమల ఏర్పాటు మరింత సులభం...

-మొదటిపేజీ తరువాయి

ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను తొలగించి, వ్యాపారవేత్తలకు అనుకూల వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆర్డినెన్స్‌లు జారీ చేసి అయినా సరే, సంస్కరణలను వేగంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై చర్చించేందుకు కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని బృందం సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కేంద్ర బృందంతో సీఎం సమీక్ష.. మే నాటికి ఫేజ్-2 పూర్తి లక్ష్యం**

కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం, రాష్ట్రంలో డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో విస్తృతంగా చర్చించింది. పరిశ్రమల ఏర్పాటులో వేగాన్ని పెంచడం, అనుమతులను సులభతరం చేయడం, అనవసర నిబంధనలను తొలగించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్ సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను, భవిష్యత్ ప్రణాళికలను ఆయా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో భాగంగా 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఫేజ్-2లో 28 అంశాలను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని అధికారులు వివరించారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

**బ్రిటీష్ చట్టాల రద్దు.. అనుమతుల సరళీకరణపై కీలక ఆదేశాలు**

పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని, క్లిష్టతను పూర్తిగా తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు, లైసెన్సుల సంఖ్యను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని ఆదేశించారు. అయితే, ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అనవసర వేధింపులు తగ్గించేందుకు థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని సూచించారు. వ్యాపార రిజిస్ట్రేషన్లకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని అన్నారు. ఫైర్ సేఫ్టీ విషయంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలంగా ఉండే సరళమైన నిబంధనలు అమలు చేయాలని, ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు పట్టే సమయం కనీసం 40 శాతం తగ్గాలని నిర్దేశించారు.

**ఒకే శాఖలో అనుమతుల విలీనం.. అవసరమైతే ఆర్డినెన్సులు**

డి-రెగ్యులేషన్ ఫేజ్-2ను వేగంగా అమలు చేయడానికి అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం ఉన్న 82 రకాల అనుమతులను దశలవారీగా 57కు తగ్గించాలని సూచించారు. బిల్డింగ్ ప్లాన్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వంటి వాటికి సంబంధించిన 30 ప్రక్రియలను 18కి తగ్గించాలని చెప్పారు. ఒకే శాఖ పరిధిలోని పలు అనుమతులను విలీనం చేయడం, కొన్నింటికి అనుమతులు కాకుండా కేవలం ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలకు కొనసాగింపుగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అన్ని అనుమతులు ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అఫిడవిట్‌తో వ్యాపారం.. డిజిటలైజేషన్‌కు పెద్దపీట**

పెట్టుబడిదారులకు మరింత భరోసా కల్పించే దిశగా, అఫిడవిట్ ఆధారంగానే వ్యాపారం ప్రారంభించే అవకాశాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. నిర్దిష్ట కాలం పాటు తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో అనుకూల వాతావరణం సృష్టించాలని అన్నారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగం నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకు మొత్తం ప్రక్రియను డిజిటలైజ్ చేయాలని, దీనివల్ల పారదర్శకత పెరుగుతుందని వివరించారు. మీ సేవా, సింగిల్ డెస్క్ పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ 'మన మిత్ర' వంటి వ్యవస్థల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సేవలను సులభతరం చేయాలని ఆదేశించారు. పర్యాటకం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో కూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

**ఏపీ పనితీరు అద్భుతం.. ఫేజ్-3లో ఏఐకి ప్రాధాన్యం**

డి-రెగ్యులేషన్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపిస్తున్న చొరవను, పనితీరును కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ప్రశంసించారు. కేంద్రం ప్రతిపాదించిన అంశాల కంటే ఏపీ మెరుగ్గా పనిచేస్తోందని, నిర్దేశిత గడువులోగా ఫేజ్-2ను పూర్తి చేస్తుందన్న నమ్మకం ఉందని అన్నారు. ం

దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ, 'నేషన్ ఫస్ట్' నినాదంతో పనిచేస్తున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానానికి మారామని తెలిపారు. అటవీ చట్టాలను కూడా సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3లో టెక్నాలజీ, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్ వంటి వ్యవస్థలను వినియోగిస్తున్నామని వారికి వివరించారు.

# తులం బంగారం ధర చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే



అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చితి నెలకొన్నప్పుడు ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు విఫలం కావడం, హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించడం వంటి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం భయాలను పెంచాయి. దీని ప్రభావంతో స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతుండగా, బంగారం ధరలు మాత్రం రికార్డు స్థాయిలకు చేరుతున్నాయి. నేడు భారతీయ మార్కెట్లో 24 క్యారెట్ల (మేలిమి) బంగారం ధర పది గ్రాములకు రూ.1,52,830 వద్ద పలుకుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో బంగారం ధరలు ఒకే రకంగా ఉన్నాయి. ఇక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,830 కాగా, ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,090 కు చేరింది. అంటే దాదాపు లక్షన్నర రూపాయలకు దగ్గరగా పసిడి రేటు ఉండటంతో పెళ్లిళ్ల సీజన్లో ఉన్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నైలో మాత్రం ధరలు వీటికంటే కాస్త ఎక్కువగా (రూ.1,53,810) ఉన్నాయి. బంగారంతో పోటీ పడుతూ వెండి కూడా భారీగానే పెరుగుతోంది. దేశీయ మార్కెట్లో నేడు కిలో వెండి ధర రూ.2,64,900 వద్ద ఉంది. అంటే గ్రాము వెండి ధర సుమారు రూ.264.90 పలుకుతోంది. పారిశ్రామికంగా వెండికి డిమాండ్ పెరగడం, ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో వెండి ధరలు కూడా వచ్చే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బంగారం ధరలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పటికీ, యుద్ధ మేఘాలు తొలగిపోకపోతే ఇవి ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ధర తగ్గినప్పుడల్లా కొంచెం కొంచెం కొనుగోలు చేసే బై ఆన్ డిప్స్ పద్ధతిని పాటించాలని సూచిస్తున్నారు. అయితే స్థానిక డిమాండ్, రాష్ట్ర పన్నులు, మేకింగ్ ఛార్జీల బట్టి మీరు కొనే జువెలరీ షాపులో ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.

# చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తాం



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది. చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు.

ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణను దుర్వినియోగం చేసి ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య జరుగుతున్న ఈ పోరాటం ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. సరఫరా గొలుసును ప్రభావితం చేయడంతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కూడా దారితీయవచ్చు. ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చైనా సహకారం ఒక అడ్డంకిగా ఉంది. ఈ పరిస్థితుల్లో, వాణిజ్య సుంకాలను పెంచడం ద్వారా ట్రంప్ చైనాపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ చర్యలు కొత్త వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# క్లిష్ట పరిస్థితుల్లో ఎయిరిండియా

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం, అంతర్గత నాయకత్వ మార్పుల నేపథ్యంలో ఎయిర్ ఇండియా ప్రస్తుతం ఒక క్లిష్ట దశను ఎదుర్కొంటోందని టాటా సన్స్ చైర్మెన్ ఎన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన ఉద్యోగుల అంతర్గత సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యుద్ధం కారణంగా విమాన సర్వీసుల రద్దు, మార్గాల మార్పు, పెరిగిన ఇంధన ధరలు సంస్థపై తీవ్ర ఒత్తిడి పెంచాయని వివరించారు. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతానికి విమాన రాకపోకలు 30 శాతానికి పడిపోయాయని తెలిపారు. యూరప్ వెళ్లే విమానాలు ఆఫ్రికా మీదుగా సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ సంస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో చేపట్టిన దీర్ఘకాలిక మార్పులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. గడిచిన నాలుగేండ్లలో సుమారు 17,000 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోవడం, నాలుగు ఎయిర్‌లైన్స్‌ను రెండుగా విలీనం చేయడం, విమానాల్లో అత్యాధునిక సదుపాయాలను కల్పించడం వంటి కీలక మార్పులు జరిగాయని వివరించారు. సంస్థ నిర్వహణలో భద్రత అనేది అత్యంత కీలకమని, దీనిపై ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పునరుద్ఘాటించారు. విమానంలో మొదటి వరుసలో ఉన్న వారితో పాటు చివరి వరుసలో కూర్చున్న ప్రయాణికులకు కూడా సమానమైన గౌరవం, మర్యాద దక్కాలన్నదే తమ ప్రధాన విధానమని ఆయన ఉద్యోగులకు వివరించారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో




ఉద్యోగులు చూపుతున్న పట్టుదల అభినందనీయమని.. టాటా గ్రూప్ ఎల్లప్పుడూ ఎయిర్ ఇండియాకు అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. బయట నుండి వచ్చే విమర్శలను సానుకూలంగా స్వీకరించి ఒకవేళ అవి సహేతుకమైతే లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేసి సంస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని చంద్రశేఖరన్ కోరారు. కస్టమర్ సంతృప్తిని పరమావధిగా పెట్టుకుని ముందుకు సాగాలని ఆయన కోరారు.

## ఈ ఆర్థిక సంవత్సరంలో 25,000 మంది ఫ్రెషర్ల నియామకం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోబోతున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. గిరాకీ ఆధారంగా మరింత మందిని నియమించుకుంటామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో టీసీఎస్ 44,000 మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ ఏమైనా మార్పులు చేసిందా? అని కృతివాసన్‌ను ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి శిక్షణ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా మారడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాల ఆధారంగా నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు. 2025-26లో 12,000 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించింది. కంపెనీలో మెరుగైన పని తీరు కనబరిచినంత వరకు కెరీర్‌కు ఇబ్బంది ఉండదని కృతివాసన్ భరోసా ఇచ్చారు. గత ఏడాది కోతలకు, కృత్రిమ మేధ (ఏఐ) కారణమన్న వాదనలను తోసిపుచ్చారు. తొలగించిన ఉద్యోగుల్లో చాలా మంది సీనియర్ లెవల్‌కు చెందిన వారని తెలిపారు.

## 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా పెంపు




పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన అంతరాయాల మధ్య ఇంధన లభ్యతను నిర్వహించే క్రమంలో మన దేశంలో 5 కిలోల చిన్న ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాను పెంచారు. అలాగే పైప్డ్ సహజ వాయువు (పీఎన్‌జీ) కనెక్షన్లను కూడా పెంచారు. మార్చి 23 నుంచి 13 లక్షలకు పైగా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లను విక్రయించారు. ప్రస్తుతం రోజువారీ విక్రయాలు లక్ష యూనిట్లను అధిగమించాయి. వలస కార్మికులు, తక్కువ ఆదాయ వినియోగదార్లు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. మార్చి నుంచి 4,24,000 కొత్త పీఎన్‌జీ కనెక్షన్లను యాక్టివేట్ చేశారు. పరివర్తనలో భాగంగా 30,000 మందికి పైగా వినియోగదార్లు ఎల్‌పీజీ కనెక్షన్లను సరెండర్ చేశారు. ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం: పశ్చిమాసియాలో యుద్ధం మొదలై ఆరు వారాలు కావడంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు నెలకొన్నాయి. మన దేశం సగానికి పైగా ముడి చమురును, 40 శాతం గ్యాస్‌ను, 85-90 శాతం ఎల్‌పీజీని ఈ ప్రాంతం నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశ అవసరాల కోసం ఇతర ప్రాంతాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నా, ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం ఉంది. దీంతో ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య వినియోగదార్లకు సరఫరాలో కోతలు విధిస్తూ, గృహ వినియోగదార్లకు ఎల్‌పీజీ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చింది. వంట గ్యాస్ ఎల్‌పీజీ కనెక్షన్లు లేని వారి కొరతను భర్తీ చేయడానికి మార్కెట్ ధరకు లభించే 5 కిలోల సిలిండర్ల సరఫరాను పెంచింది. సంక్షోభానికి ముందు ఫిబ్రవరిలో సుమారు 77,000 అయిదు కిలోల సిలిండర్ల అమ్మకాలు జరగ్గా, గత 2-3 వారాలుగా రోజువారీ అమ్మకాలు లక్ష దాటాయి. గృహ ఎల్‌పీజీ సరఫరాలు మొత్తంగా స్థిరంగా ఉన్నాయని, ఏప్రిల్ 11న 52 లక్షలకు పైగా సిలిండర్లను సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

## 'ఆధునిక కాలపు హిట్లర్' నెతన్యాహు

ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును 'ఆధునిక కాలపు హిట్లర్'గా టర్కీ అభివర్ణించింది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ వ్యాఖ్యలపై ఇరు దేశాల మధ్య పెరుగుతున్న మాటల యుద్ధంపై టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్ సైనిక చర్యలను, పాలస్తీనా సమస్యపై దాని వైఖరిని ఎర్డోగాన్ తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ప్రభుత్వం ముందుకు రావడంతో ఈ వివాదం మరింత తీవ్రమైంది. ఎర్డోగాన్‌పై ఇజ్రాయిల్ చేసిన విమర్శలకు ప్రతిస్పందనగా, టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ నెతన్యాహును నాజీ నియంత హిట్లర్‌తో పోల్చింది. గాజా మరియు మధ్యప్రాచ్యంలో జరిగిన మారణకాండలకు నెతన్యాహు సమాధానం చెప్పాల్సి ఉంటుందని కూడా టర్కీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎర్డోగాన్ వ్యాఖ్యలు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఇజ్రాయిల్ విమర్శించింది. ఈ ప్రాంతంలో శాంతి ప్రయత్నాలను టర్కీ దెబ్బతీస్తోందని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఒకప్పుడు సన్నిహిత రక్షణ, ఆర్థిక సంబంధాలను కలిగి ఉన్న టర్కీ ? ఇజ్రాయిల్ మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో తీవ్రంగా దిగజారాయి. పాలస్తీనా సమస్యపై ఎర్డోగాన్ తీసుకున్న కఠిన వైఖరి మధ్యప్రాచ్య దేశాలలో టర్కీకి పలుకుబడిని పెంచినప్పటికీ, అది ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీసింది. ఈ మాటల యుద్ధం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచుతూ, మధ్యప్రాచ్య రాజకీయాలను మరింత సంక్లిష్టతరం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## వీడుతున్న ఆక్రమణల చెర

గ్రేటర్ హైదరాబాద్‌లో ఇటీవల ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రభుత్వం కొరడా ఝులిపించడంతో నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విస్తరిస్తున్న నగరానికి తగ్గట్టుగా రహదారులు లేకపోవడంతోపాటు భారీగా వాహనాల పెరుగుదలతో హైదరాబాద్ ట్రాఫిక్ పద్మవ్యూహంలో ప్రజలు నిత్యం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగర ప్రజలు రద్దీ సమయాల్లో రోడ్లపై నడవాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్న కొన్ని ఫుట్‌పాత్‌లను కూడా చిరు, బడా వ్యాపారస్థులు కబ్జాలు చేయడంతో ఏమీ చేయలేక రోడ్డుపైనే నడుస్తూ ప్రయాణికులు ప్రమాదాలకు గురైన ఘటనలు నగరంలో అనేకం ఉన్నాయి. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం నగరం నలువైపులా ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాల తొలగింపుకు నడుం కట్టడంతో ప్రజలకు భారీ ఉపశమనం లభించనుంది. రాజకీయంగా, అధికారికంగా ఏ రూపంలోనైనా ఒత్తిడిలు వచ్చినా కబ్జాదారుల కబంధహస్తాల నుండి ఫుట్‌పాత్‌లను విముక్తి చేయాలి. వేగంగా అభివృద్ధి చెందుతూ మెట్రో నగరంగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ ఐటి, మౌలిక వసతులు, రహదారుల విస్తరణలో ముందంజలో ఉన్నా ఫుట్‌పాత్‌ల పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నాయి. దీంతో వేగంగా వెళ్లే వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా వృ ద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో నడక ప్రమాదకరంగా మారిపోయింది. ప్రతి సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌లో వెయ్యికిపైగా పాదచారుల ప్రమాదాలు నమోదవుతున్నాయి. ఉదాహరణకు 2024 గణాంకాలు పరిశీలిస్తే 400 మంది పాదచారులు ప్రమాదంలో మృతి చెందారు. 775 మంది గాయపడ్డారు. అంటే నగరంలో రోజుకు సుమారు 30 మందికిపైగా పాదచారులు రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ ప్రమాదాలు అత్యధికంగా ఫుట్‌పాత్ సమస్యలతో ముడిపడి ఉండడం గమనార్హం. నగరంలో రహదారుల, ఫుట్‌పాత్ సమస్యలు పరిష్కరించడంలో భాగంగా వాటిని అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సుమారు మూడు వేల కోట్లకుపైగా రూపాయలు వెచ్చించి వెయ్యి కిలోమీటర్లకు పైగా రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది.

ఈ ప్రాజెక్టులో భాగంగా బిటి, సిసి రోడ్లతోపాటు ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్లు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 700 కిలోమీటర్లకుపైగా రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు, అదనంగా 200 కిలోమీటర్లకుపైగా రోడ్లను ఎఫ్‌డిఆర్ సాంకేతికతతో పునర్నిర్మాణం చేయనున్నారు. వీటితోపాటు నగరం మొత్తం ఫుట్‌పాత్‌లను కూడా సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిహెచ్ఎంసి 2025 –26లో గుంతలు పూడ్చడంతోపాటు ట్రాఫిక్ భద్రతా చర్యలను చేపట్టింది. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు 24 లింక్ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ. 487 కోట్ల ప్రణాళికను అమలు చేస్తున్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యలకు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న కట్టడాలపై కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైన జిహెచ్ఎంసి ప్రతి వారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా నగరం నలువైపులా అక్రమ కట్టడాలను తొలగించేందుకు ముందుకొచ్చిన జిహెచ్ఎంసి ఏప్రిల్ 4వ తేదీన హైడ్రా, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకొని ఆరు జోన్ల పరిధిలోని 798 నిర్మాణాలను నేలమట్టం చేసింది. తొలగించిన వాటిలో 340 పూర్తిస్థాయి, 458 తాత్కాలిక నిర్మాణాలున్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సున్నితమైన పాతబస్తీతోపాటు కొన్ని చోట్ల ఉద్రిక్తతలు నెలకొన్నా అధికారులు సమన్వయంతో విజయవంతంగా అక్రమాలను తొలగించారు. ఇదే తరహాలో ఇకపై నగరవ్యాప్తంగా ప్రతివారం ఏదో ఒక ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని జిహెచ్ఎంసి అధికారులు ప్రకటించడంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నగర ప్రజలు ఇదే కోరుకుంటున్నారు.

చారిత్రాత్మకమైన హైదరాబాద్ నగరంలోని ప్రధాన మార్గాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు పలు సమస్యలకు కారణాలవుతున్నాయి. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకట్టుకునే చార్మినార్ పరిసరాల్లో వ్యాపారస్థులు పూర్తిగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పర్యాటకులు నడవలేని పరిస్థితి నెలకొంది. దక్షిణ హైదరాబాద్‌కు ముఖద్వారమయిన మూసీనదిపై నాటి నిజాం కాలంలో నిర్మించిన వంతెన ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ప్రస్తుతం పాతబస్తీలో మూసీ నదిపై ఉన్న వంతెనలన్నింటిలో 'నయాపూల్'గా పిలువబడే వంతెన ఎత్తైనది. భారీ వాహనాల ప్రయాణానికి అనువుగా నిర్మించిన ఈ వంతెనపై రిక్షాలు, సైకిళ్ల కోసం, పాదచారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. 2000 సంవత్సరం వరకు ఇదే తరహాలో ఉండేది. అయితే దురదృష్టవశాత్తు ఇప్పుడు భారీ వాహనాల మార్గం మినహాయించి రిక్షాలు, సైకిళ్లు, పాదచారులకోసం ఏర్పాటు చేసిన మార్గాలు పూర్తిగా తోపుడు బండ్లతో నిండిపోతున్నాయి. అక్కడ పాదచారులు భారీ వాహనాలు నడిచే మార్గంలోనే నడవాల్సి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇదే మార్గంలో ముందుకెళ్తే చారిత్రాత్మక కట్టడాలున్న మదీనా, గుల్జర్‌హౌజ్, చార్మినార్ మరింత క్లిష్ట పరిస్థితులున్నాయి. పాతబస్తీలోనే కాదు నగరం నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్, కోఠి, నాంపల్లి, చిక్కడిపల్లి, మెహిదీపట్నం, ఆరాంఘర్, పంజాగుట్ట, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ వంటి పలు ప్రధాన మార్గాల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా స్పందించకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిలో తప్పు చేస్తున్నామనే స్పందనలేకపోవడం, రాజకీయ ప్రయోజనాలతో వారికి మద్దతుగా నేతలు బలప్రదర్శన చేస్తూ అధికారులను అడ్డుకోవడం దురదృష్టకరం. ఇటీవల నగరంలోని ఆరు జోన్లలో అక్రమాలను తొలగిస్తుంటే పాతబస్తీతోపాటు కొన్ని చోట్ల నాయకులు అడ్డుకోవడానికి ప్రయత్నించినా అధికారులు వెనక్కి తగ్గకుండా పని పూర్తిచేయడం అభినందనీయం.

ఎంతోకాలంగా అక్కడ వ్యాపారాలు చేస్తున్నారని, వారందరూ చిరు వ్యాపారులు అంటూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారికి మద్దతుగా నిలిచే వారు వాదిస్తున్నారు. దీర్ఘకాలికంగా వారక్కడ ఆక్రమించి ప్రజలను ఇబ్బందుల పాలుచేస్తున్నారనే ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంటుందనే వాస్తవాన్ని వారు గ్రహించాలి. చిరువ్యాపారుల జీనవోపాధి దెబ్బతినడం బాధాకరమే. ఇలాంటి వారి కోసం అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా ప్రత్యామ్నాయం ఆలోచించి చర్యలు తీసుకోవాలి. మరోవైపు ప్రధాన కూడళ్లలో బడా వ్యాపారస్థులు కూడా తమ దుకాణాలకు ముందున్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి లావాదేవీలు నిర్వహిస్తున్న ప్రదేశాలు నగరంలో కోకొల్లలు. మరికొన్ని చోట్ల పెద్ద వ్యాపారస్థులే వారి మనుషులతో ఫుట్‌పాత్‌లను ఆక్రమింపజేసి వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. వాస్తవాలు ఇలా ఉంటే చిరువ్యాపారులకు అన్యాయం జరుగుతుందంటూ రాజకీయ నేతలు అధికారులపై ఒత్తిడి తేవడం ప్రజలను ఇబ్బందుల పాలుజేయడమే. విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరానికి అనుగుణంగా రహదారులు, ఫుట్‌పాత్ అభివృద్ధి కోసం ఆలస్యంగానైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై కబ్జాల తొలగింపు కార్యక్రమాన్ని ఒక్క రోజుకే పరిమితం చేసి చేతులు దులుపుకోకుండా ఆ అక్రమ కట్టడాలపై పర్యవేక్షణ నిత్యం కొనసాగాలి. తొలగించిన కట్టడాలను పాతబస్తీ వంటి కొన్ని ప్రాంతాల్లో తిరిగి నిర్మిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటిని అరికడితేనే ప్రభుత్వ లక్ష్యం సఫలమవుతుంది. ఎలాంటి ఒత్తిడిలకు లొంగకుండా పాతబస్తీతో సహా నగరంలోని నలుమూలల రహదారులపై అక్రమంగా వెలిసిన కట్టడాలన్నింటినీ తొలగించాలని నగరవాసులు అందరూ కోరుకుంటున్నారు. ఆక్రమణల తొలగింపుతో గ్రేటర్ రహదారులకు మహర్దశ ఏర్పడుతుందని ఆశిస్తున్నారు. ఇలాంటి బహత్కరమైన కార్యక్రమాలను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా కొనసాగిస్తే కబ్జాదారులు మరోసారి అక్రమాలు చేయడానికి సాహసించరు.

# అల్జీమర్స్ ముప్పు ఆడవారికే ఎందుకు ఎక్కువ?



వయసు పైబడిన వారిలో కనిపించే అతిపెద్ద ఆరోగ్య సమస్య అల్జీమర్స్ అయితే, ఈ వ్యాధి పురుషుల కంటే మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తుండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అల్జీమర్స్ బాధితుల్లో మూడింట రెండు వంతులు మహిళలే ఉండటం గమనార్హం. అసలు దీనికి కారణాలు ఏంటి? సైన్స్ ఏం చెబుతోంది? మహిళల్లో హార్మోన్ల మార్పులు అల్జీమర్స్ ముప్పును పెంచుతాయి. ముఖ్యంగా మెనోపాజ్ సమయంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు పడిపోతాయి. మెదడు కణాలను రక్షించడంలో ఈస్ట్రోజెన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ హార్మోన్ తగ్గడం వల్ల మెదడులో మార్పులు సంభవించి మతిమరుపుకు దారితీసే అవకాశం ఉంది. కొన్ని ప్రత్యేకమైన జన్యువులు మహిళలపైనే ఎక్కువ ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ంఖూఇ–4 అనే జన్యువు ఉన్న మహిళల్లో, అదే జన్యువు ఉన్న పురుషుల కంటే అల్జీమర్స్ వచ్చే రిస్క్ చాలా ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. సాధారణంగా పురుషుల కంటే మహిళలు ఎక్కువ కాలం జీవిస్తారు. అల్జీమర్స్ అనేది వయసుతో పాటు పెరిగే వ్యాధి. మహిళలు ఎక్కువ కాలం జీవించడం వల్ల వృద్ధాప్యంలో ఈ వ్యాధి బారిన

పడే అవకాశాలు కూడా సహజంగానే పెరుగుతున్నాయి. మహిళల మెదడులో గ్లూకోజ్ వినియోగం, శక్తి ఉత్పత్తి ప్రక్రియలు పురుషుల కంటే భిన్నంగా ఉంటాయి. మెనోపాజ్ దశలో మెదడుకు అందే శక్తి తగ్గడం వల్ల అమిలాయిడ్ ప్లాక్స్ వంటి వ్యర్థాలు మెదడులో పేరుకుపోయి జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తాయి. అల్జీమర్స్ నుంచి తప్పించుకోవడానికి లేదా దాని తీవ్రతను తగ్గించడానికి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. దీనికోసం సరైన ఆహారం అవసరమని అంటున్నారు. మెదడు

పనితీరును మెరుగుపరిచే ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్, ఆకుకూరలు తీసుకోవాలి. శారీరక శ్రమ మెదడుకు రక్త ప్రసరణను పెంచుతుంది. సుడోకు, పజిల్స్ పూర్తి చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం ద్వారా మెదడును యాక్టివ్‌గా ఉంచాలి. డాక్టర్ల సలహాతో మెనోపాజ్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అల్జీమర్స్ అనేది కేవలం వృద్ధాప్య సమస్య మాత్రమే కాదు, మహిళల విషయంలో ఇది హార్మోన్లు మరియు జన్యువుల కలయిక. అందుకే మహిళలు 40 ఏళ్ల నుంచే తమ మెదడు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం అవసరం.

# టీ ఇలా తాగుతున్నారా?

చాలామందికి ఉదయం నిద్రలేవగానే వేడివేడి టీ కప్పుతో రోజును ప్రారంభించడం ఒక అలవాటు. ఆ ఛాయ్ పడకపోతే ప్రాణం లేవదని, బుర్ర పనిచేయదని అంటుంటారు. అయితే, పరగడుపున టీ తాగడం వల్ల మీ శరీరంలో కొన్ని ప్రతికూల శారీరక మార్పులు సంభవిస్తాయని మీకు తెలుసా? ఖాళీ కడుపుతో టీ తాగడం అనేది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, అది మీ జీర్ణవ్యవస్థను దెబ్బతీసే ప్రమాదకరమైన సంకేతం కూడా కావచ్చు. టీలో ఉండే కెఫీన్ శరీరానికి తక్షణమే ఉత్సాహాన్ని ఇస్తుందని మనం భావిస్తాం. కానీ, పరగడుపున దీనిని తీసుకోవడం వల్ల కడుపులో యాసిడ్ స్రావం ఒక్కసారిగా పెరుగుతుంది. దీనివల్ల అజీర్ణం, ఛాతీలో మంట మరియు కడుపులో అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ అలవాటును దీర్ఘకాలం పాటు కొనసాగిస్తే, కడుపు లోపల ఉండే సున్నితమైన పొర దెబ్బతిని, కడుపులో అల్సర్లు వచ్చే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డీహైడ్రేషన్: రాత్రంతా నిద్రపోయి ఉదయం లేవగానే మన శరీరం సహజంగానే కొంత డీహైడ్రేషన్‌కు గురై ఉంటుంది. టీకి మూత్రవిసర్జనను ప్రేరేపించే గుణం ఉండటం వల్ల, ఖాళీ కడుపుతో దీనిని తాగినప్పుడు శరీరంలోని ద్రవాలు మరింత తగ్గిపోతాయి. దీనివల్ల రోజు మొదట్లోనే తీవ్రమైన అలసట, నీరసం మరియు తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామంది తమకు టీ తాగకపోవడం వల్ల తలనొప్పి వస్తుందని భావిస్తారు, కానీ వాస్తవానికి టీ వల్ల కలిగే డీహైడ్రేషన్ కూడా ఒక కారణం కావచ్చు. ఉదయాన్నే లేవగానే



టీకి బదులుగా ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగడం అత్యంత ఉత్తమమైన అలవాటు. నీరు తాగడం వల్ల శరీరంలోని విషతుల్యాలు బయటకు వెళ్లిపోతాయి మరియు జీర్ణవ్యవస్థ ఉత్తేజితమవుతుంది. ఒకవేళ మీరు టీ తాగాలనుకుంటే, ఏదైనా అల్పాహారం లేదా భోజనం చేసిన తర్వాత తీసుకోవడం సురక్షితం. అప్పుడు ఆహారం కడుపులో ఉండటం వల్ల టీలోని కెఫీన్ నేరుగా కడుపు గోడలపై ప్రభావం చూపదు. చిన్నపాటి మార్పులే పెద్ద ఆరోగ్య ఫలితాలను ఇస్తాయి. టీలో అల్లం లేదా యాలకులు వంటి సహజ పదార్థాలు చేర్చుకోవడం మంచిదే అయినప్పటికీ, అది పరగడుపున తాగకపోవడమే శ్రేయస్కరం. ఉదయాన్నే నీటితో పాటు కొన్ని నానబెట్టిన బాదం పప్పులు లేదా వాల్‌నట్స్ తీసుకోవడం వల్ల మీ శరీరానికి తగిన పోషణ లభిస్తుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం మీ ఉదయపు అలవాట్లను ఒక్కసారి పునరాలోచించుకోండి.

# ఇంటి పెరట్లో ఈ చిన్న మొక్క ఉంటే..



ప్రకృతి మనకు ఎన్నో ఉపయోగకరమైన పండ్లు, ఆకుకూరలు ఇస్తుంది. కానీ ప్రకృతి మన నుండి ప్రతిఫలంగా ఏమీ అడగదు. కొన్ని మొక్కలు, చెట్లు కూడా మనకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ముఖ్యంగా ఇంట్లో పుదీనా మొక్కలు పెంచుకుంటే దానివల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు అందుతాయి. పుదీనాలో ఔషధ గుణాలు దండిగా ఉన్నాయి. ప్రకృతి మనకు ఎన్నో ఉపయోగకరమైన పండ్లు, ఆకుకూరలు ఇస్తుంది. కానీ ప్రకృతి మన నుండి ప్రతిఫలంగా ఏమీ అడగదు. కొన్ని మొక్కలు, చెట్లు కూడా మనకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ముఖ్యంగా ఇంట్లో పుదీనా మొక్కలు పెంచుకుంటే దానివల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు అందుతాయి.

పుదీనాలో ఔషధ గుణాలు దండిగా ఉన్నాయి. దీని ఆకులు కూరల్లో వేస్తే ఘుమ ఘుమలే కాదు ఆరోగ్యానికి కూడా ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. అంతేనా పుదీనా ఆకులతో డీటాక్స్ వాటర్ కూడా తయారు చేసుకోవచ్చు. శరీరంలో ఆహార వ్యర్థాలు, మందుల తాలూకు రసాయనాలు టాక్సిన్లుగా ఉండిపోతాయి. అప్పుడప్పుడూ అయినా శరీరానికి డీటాక్సిఫికేషన్ అవసరం. అందుకోసం పుదీనా నీళ్లు చక్కగా పనిచేస్తాయి. ఓ గాజు సీసాలో కొన్ని పుదీనా ఆకులు, చక్రాల్లా తరిగిన నిమ్మకాయ ముక్కలూ వేసి నీళ్లు పోయండి. గంట తరువాత ఆ నీటిని కొద్దికొద్దిగా తాగి చూడండి. అలసట ఎగిరిపోతుంది. శరీరం తేలికపడుతుంది. పుదీనా ఆకులకు ఆయుర్వేద ప్రాముఖ్యత ఉంది. పుదీనా ఆకులను తినడం వల్ల శరీరంలో అనేక సానుకూల, మంచి మార్పులు వస్తాయని చెబుతారు. ఈ మార్పులలో మొదటిది జీర్ణక్రియను మెరుగుపరచడం. పుదీనా ఆహారం త్వరగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఉదయాన్నే పరగడుపున పుదీనా నీళ్ళు తాగడం వల్ల రోజంతా శక్తివంతంగా ఉంటారు. పుదీనా ఆకులు శరీరంలో నీరు నష్టపోకుండా చేస్తాయి. శరీరం డీహైడ్రేట్ అవ్వదు. పుదీనా నీళ్లు తాగితే రోజంతా తాజాగా ఉంటాం. శరీరం అలసిపోదు. పుదీనా నీళ్లు తాగడం వల్ల తలనొప్పి కూడా తగ్గుతుంది. ఇది అలసటను కూడా తగ్గిస్తుంది. పుదీనాలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. పుదీనా నీళ్ళు తాగడం వల్ల వేసవిలో చెమట దుర్వాసన రాకుండా ఉంటుంది.

# సన్‌రైజర్స్ కొత్త బౌలర్ల వికెట్ల జాతర...
# రాజస్థాన్ పై అద్భుత విజయం



హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి, రాజస్థాన్ రాయల్స్‌పై 57 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌లో కెప్టెన్ ఇషాన్ కిషన్ మెరుపులు, ఆ తర్వాత బౌలింగ్‌లో కొత్త ముఖాలు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ మాయాజాలంతో సన్‌రైజర్స్ అద్భుత ప్రదర్శన చేసింది.సన్‌రైజర్స్ నిర్దేశించిన 217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్ వేసిన ప్రఫుల్ హింగే... రెండో బంతికి వైభవ్ సూర్యవంశీ (0), నాలుగో బంతికి ధ్రువ్ జురెల్ (0), ఆరో బంతికి ప్రిటోరియస్‌ను (0) పెవిలియన్‌కు పంపాడు. ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి రాజస్థాన్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఆ వెంటనే రెండో ఓవర్లో యశస్వి జైస్వాల్ (1)ను సాకిబ్ హుస్సేన్ ఔట్ చేయగా, తన తర్వాతి ఓవర్లో కెప్టెన్ రియాన్ పరాగ్ (4)ను కూడా హింగే పెవిలియన్ చేర్చాడు. దీంతో రాజస్థాన్ కేవలం 9 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

ఈ దశలో డోనోవాన్ ఫెరీరా (44 బంతుల్లో 69; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), రవీంద్ర జడేజా (32 బంతుల్లో 45; 5 ఫోర్లు) అద్భుతంగా పోరాడారు. ఆరో వికెట్‌కు 118 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరి పోరాటంతో రాజస్థాన్ గెలుపుపై కొద్దిసేపు ఆశలు రేకెత్తాయి.

అయితే, ఈ జోడీని సాకిబ్ హుస్సేన్ విడదీయడంతో రాజస్థాన్ పతనం మళ్లీ మొదలైంది. చివర్లో తుషార్ దేశ్‌పాండే (11 బంతుల్లో 25; 3 సిక్సర్లు) మెరుపులు మెరిపించినా, అప్పటికే ఆలస్యమైంది. ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ చెరో 4 వికెట్లతో రాజస్థాన్ పతనాన్ని శాసించారు. ఎషాన్ మలింగ 2 వికెట్లు పడగొట్టాడు. చివరకు రాజస్థాన్ 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది.అంతకుముందు, టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ ప్రారంభించింది. తొలి ఓవర్లోనే అభిషేక్ శర్మ (0) డకౌట్‌గా వెనుదిరిగినా, కెప్టెన్ ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 91; 8 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగాడు. రాజస్థాన్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తించాడు. శతకానికి చేరువలో అతను ఔటయ్యాడు.

ఆ తర్వాత హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్సర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (13 బంతుల్లో 28; 4 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. ముఖ్యంగా నితీశ్ తన చిన్న ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు బాది స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో సలీల్ అరోరా (13 బంతుల్లో 24) కూడా రాణించడంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు తీశాడు.ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ తన తదుపరి మ్యాచ్ ను ఈ నెల 18న చెన్నై సూపర్ కింగ్స్ తో సొంతగడ్డపై ఆడనుంది.

# బుమ్రాకు ఏమైంది?



జస్‌ప్రీత్ బుమ్రా.. ప్రస్తుతం ప్రపంచ అత్యుత్తమ ఫాస్ట్‌బౌలర్. అతడి బౌలింగ్‌లో పరుగులు చేయడం ఎంతో కష్టం. వికెట్లు కాపాడుకోవడమూ సవాలే. మహా మహా బ్యాటర్లు కూడా అతను బౌలింగ్ చేస్తుంటే ఆచితూచి ఆడతారు. తన ఓవర్ల వరకు జాగ్రత్తగా బ్యాటింగ్ చేసి, ఇతర బౌలర్లను లక్ష్యంగా చేసుకుంటారు. నెల కిందట టీ20 ప్రపంచకప్‌లోనూ అద్భుత ప్రదర్శనతో అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచాడు బుమ్రా. అలాంటి బౌలర్ ఈ ఐపీఎల్‌లో ఇప్పటిదాకా వికెట్ల ఖాతానే తెరవకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. పరుగులు కట్టడి చేయడంలోనూ అతను తన ప్రత్యేకతను చాటుకోలేకపోతున్నాడు.

ఎన్నో సీజన్ల నుంచి ముంబయి తరఫున ఉత్తమ ప్రదర్శన చేస్తూ.. ఆ జట్టుకు తిరుగులేని బలంగా ఉంటున్నాడు బుమ్రా. 2013లో ముంబయి తొలిసారి విజేతగా నిలిచిన సీజన్లో బుమ్రా అరంగేట్రం చేశాడు. ఆ జట్టు రికార్డు స్థాయిలో అయిదుసార్లు కప్పు గెలవడంలో అతడిది అత్యంత కీలక పాత్ర. చివరగా 2020లో కప్పు గెలిచాక ఐపీఎల్‌లో ముంబయి ప్రదర్శన ఏమంత గొప్పగా లేదు. కానీ బుమ్రా మాత్రం ఎప్పుడూ నిరాశపరిచింది లేదు. కానీ ఈ సీజన్లో మాత్రం బుమ్రా తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నాడు. ఒకట్రెండు మ్యాచ్‌ల్లో వికెట్లు పడలేదంటే ఏదో అనుకోవచ్చు. కానీ వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో అతడికి రిక్తహస్తమే మిగిలింది. ఒక్కటంటే ఒక్క వికెట్ తీయలేకపోయాడు. 4 మ్యాచ్‌ల్లో అతను 8.2 ఎకానమీ నమోదు చేశాడు. దిల్లీతో మ్యాచ్‌లో మాత్రమే బుమ్రా పొదుపుగా బౌలింగ్ చేశాడు. నాలుగు ఓవర్లలో 21 పరుగులు ఇచ్చాడు. కోల్‌కతాపై 35, రాజస్థాన్‌పై 32, బెంగళూరుపై 35 పరుగులు సమర్పించుకున్నాడు. వైభవ్ సూర్యవంశీ లాంటి కుర్రాడు బుమ్రా బౌలింగ్‌కు రాగానే తన ఓవర్లో రెండు సిక్సర్లు బాదడం చర్చనీయాంశంగా మారింది. ఆర్సీబీ, కోల్‌కతా బ్యాటర్లు కూడా అతణ్ని అలవోకగా ఎదుర్కొన్నారు. బుమ్రా వైఫల్యం.. ముంబయిపై గట్టి ప్రభావమే చూపుతోంది. ఈసారి టోర్నీని విజయంతో ఆరంభించిన ఆ జట్టు.. తర్వాత వరుసగా మూడు ఓటములు మూటగట్టుకుంది. బుమ్రా ఉండగా.. ముంబయి మీద ఆర్సీబీ 240 పరుగులు చేయడం ఆశ్చర్యం కలిగించే విషయం. ఈ సీజన్లో బుమ్రా వైఫల్యానికి మిగతా ముంబయి బౌలర్లూ ఓ కారణమే. ఎప్పుడూ ఆరంభ ఓవర్లలో వికెట్లు తీసి ప్రత్యర్థి జట్లను ఒత్తిడిలోకి నెట్టే బౌల్ట్ ఈసారి తేలిపోతున్నాడు. 4 మ్యాచ్‌ల్లో అతను ఒక్క వికెట్టే తీశాడు. బెంగళూరుపై బౌల్ట్ ఏకంగా 50 పరుగులు సమర్పించుకున్నాడు. ఆ జట్టులో ఏ బౌలరూ నిలకడగా రాణించట్లేదు. కొత్త బంతితో బౌల్ట్ తేలిపోతుండడంతో.. బుమ్రా బౌలింగ్‌కు వచ్చేసరికే మ్యాచ్‌లు ప్రత్యర్థి బ్యాటర్ల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. బుమ్రా కూడా వారికి కళ్లెం వేయలేకపోతున్నాడు. బుమ్రా వికెట్లు తీయకపోవడంపై ఆందోళనేమీ లేదని ముంబయి సహాయ కోచ్ పొలార్డ్ అంటున్నాడు కానీ.. చూస్తుంటే అది ముంబయికి పెద్ద సమస్యగా మారే సంకేతాలు కనిపిస్తున్నాయి.

"బుమ్రా నాలుగు ఓవర్లను దాటి ముంబయి ఆలోచించాలి. గతంలో ఆ ఓవర్లలో కూడా ముంబయి పొదుపుగా బౌలింగ్ చేసేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. బుమ్రా మీద ఎక్కువ ఆధారపడితే కష్టం. ముంబయి ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించాలి"

# అత్యంత క్రూరమైన మృణాల్‌ని చూపిస్తాడట!



టాలీవుడ్‌లో -సీతారామం-, -హాయ్ నాన్న- వంటి సినిమాలతో పద్ధతిగా.. సున్నితంగా కనిపించే పాత్రలకే పరిమితమైన మృణాల్ ఠాకూర్‌ను భవిష్యత్తులో అత్యంత క్రూరమైన- తీవ్రమైన పాత్రలో చూపించబోతున్నట్లు ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ హింట్ ఇచ్చారు. మృణాల్ కోసం ఒక సరికొత్త.. అసాధారణమైన కథాంశం తన దగ్గర ఉందని ఈ నటిలోని నటనను మరో కోణంలో ఆవిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కొందరు నెటిజన్లు సరదాగా --మృణాల్ కెరీర్‌ను అనురాగ్ మార్చేయబోతున్నారు-- అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

ప్రస్తుతం అనురాగ్ కశ్యప్ కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా.. నటుడిగా కూడా దక్షిణాదిన బిజీగా మారుతున్నారు. ఇటీవల విడుదలైన -డెకాయిట్- చిత్రంలో అతడి రియలిస్టిక్ నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు దక్కుతున్నాయి. దక్షిణాదిన ఆయన పోషించిన నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

తెలుగులో కూడా ఆయనకు క్రేజ్ పెరుగుతుండటంతో టాలీవుడ్‌లో మరిన్ని క్రేజీ ప్రాజెక్టుల్లో ఆయన భాగం కాబోతున్నారని సమాచారం. ముఖ్యంగా గ్యాంగ్‌స్టర్ డ్రామాల్లో అతడి విలక్షణమైన బాడీ లాంగ్వేజ్‌కు దర్శకులు ప్రాధాన్యతనిస్తున్నారు.

దక్షిణాదిన తమిళ చిత్ర పరిశ్రమలో కూడా అనురాగ్ కశ్యప్ తనదైన ముద్ర వేస్తున్నారు. ఇప్పటికే విజయ్ సేతుపతి -మహారాజా- వంటి చిత్రాల్లో విలన్‌గా మెప్పించిన ఆయన మరికొన్ని భారీ తమిళ సినిమాల్లో కీలక పాత్రలకు సంతకం చేశారు. అలాగే మలయాళ చిత్రాల్లోనూ ఆయన ప్రవేశం ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఒకవైపు బాలీవుడ్‌లో కల్ట్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటూనే మరోవైపు సౌత్ సినిమాల్లో నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను అద్భుతంగా కొనసాగిస్తున్నారు.ఇక మృణాల్ ఠాకూర్ కెరీర్ విషయానికి వస్తే... ఈ ట్యాలెంటెడ్ బ్యూటీ ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉంది. తెలుగులో నాని, విజయ్ దేవరకొండ వంటి హీరోలతో నటించిన తర్వాత ఇప్పుడు బాలీవుడ్ - సౌత్ మధ్య బ్యాలెన్స్ చేస్తోంది. ఇటీవల దేవగన్ సరసన నటించిన -సన్ ఆఫ్ సర్దార్ 2- కూడా విడుదలైంది. కొన్ని తమిళ ప్రాజెక్టులు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. నటనకు ప్రాధాన్యత ఉన్న వైవిధ్యమైన పాత్రలను మృణాల్ ఎంచుకుంటోంది.మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత బిజీ దశలో ఉంది, ఆమె చేతిలో వైవిధ్యమైన హిందీ ప్రాజెక్టులు ఉన్నాయి. వరుణ్ ధావన్ సరసన డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న -హై జవానీ తో ఇష్క్ హోనా హై- ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉండగా.. ఇందులో సరికొత్త గ్లామరస్ రోల్‌లో కనిపించబోతోంది. అలాగే ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ -పూజా మేరీ జాన్- ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. ఇందులో మృణాల్ టైటిల్ పాత్రను పోషిస్తోంది. వీటితో పాటు 2027లో విడుదలకు సిద్ధమవుతున్న -రాకా- అనే భారీ ప్రాజెక్టులో బన్నీతో కలిసి నటిస్తోంది. ఈ భారీ చిత్రాలు మృణాల్ ను గ్లామ్ బిజ్ లో మరింత సుస్థిరమైన స్థానంలో నిలబెడతాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.అంతేకాదు... అనురాగ్ కశ్యప్ వంటి దర్శకుడు మృణాల్‌ను -బ్రూటల్-గా చూపిస్తానంటే తన కెరీర్‌లో అదొక మేలిమలుపు కావడం ఖాయం. ఒక క్లాసిక్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న మృణాల్..అనురాగ్ ప్రపంచంలో క్రూరమైన పాత్రలో ఎలా ఒదిగిపోతుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ కాంబినేషన్ సెట్స్ పైకి వెళ్తే వినోద రంగంలో అది మరో సంచలనమే అవుతుంది.



ప్రతిభా రంతా యొక్క రాయల్ ప్రకాశం: జాతి సంపద

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com